నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 12-8-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 9 పేజీలు: 4 వెల: రూ.1/-

కరోనా అనుభవాలతో పాఠాలు నేర్చుకోవాలి

దేశంలో వైద్యసదుపాయాల పెంపుపై దృష్టి పెట్టాలి
సమగ్ర వైద్య సదుపాయాల కోసం ప్రణాళిక చేయాలి

ప్రధాని మోడీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రగతి భవన్ నుంచి పాల్గొన్న సిఎం కెసిఆర్, మంత్రి ఈటెల రాజేందర్, సిఎస్ సోమేశ్ కుమార్ తదితరులు

హైదరాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): కరోనా అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, దేశంలో వైద్య సదుపాయాలను పెంచే విషయంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సూచించారు. కరోనా కొత్త అనుభవానలు నేర్పిందన్నారు.

పది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కరోనాపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో కరోనా పరిస్థితిని వివరించారు. దేశంలో వైద్య సదుపాయాలను పెంచాల్సిన అవసరాన్ని కరోనా గుర్తు చేసిందని సీఎం అన్నారు. కరోనా అనుభవాలు మనకు పాఠం నేర్పాయి. దేశంలో వైద్య సదుపాయాలు పెంచాల్సిన అవసరం ఉంది. వైద్య రంగంలో భవిష్యత్ కోసం ఎలాంటి చర్యలు తీసుకో వాలనే విషయంలో విజనరీతో ఆలోచించాలన్నారు. సమగ్ర వైద్య సదుపాయాల కోసం ప్రణాళిక చేయాలి. కేంద్రాలు, రాష్ట్రాలు కలిసి ఈ ప్రణాళిక అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు. గతంలో మనకు కరోనా లాంటి అనుభవం లేదు. ఈ పరిస్థితి ఎన్ని రోజులు ఉంటుందో తెలియదన్నారు. దీన్ని ఎదుర్కొంటూనే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు వస్తే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే విషయంపై దృష్టి పెట్టాలని సూచన చేశారు. గతంలో కూడా అనేక వైరస్ లు ప్రజలను ఇబ్బంది పెట్టాయి. కరోనా వైరస్ లాంటివి భవిష్యత్తులో కూడా వచ్చే అవకాశం ఉంది. వైద్య రంగంలో ఏ విపత్కర పరిస్థితి తలెత్తినా సరే తట్టుకునే విధంగా మనం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని తెలిపారు. జనాభా నిష్పత్తి ప్రకారం ఎంత మంది డాక్టర్లు ఉండాలి? ఇంకా ఎన్ని మెడికల్ కాలేజీలు రావాలి? లాంటి విషయాలను ఆలోచించాలన్నారు. ఐఎంఎ లాంటి సంస్థలతో సంప్రదించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇది తప్పకుండా ఆలోచించాల్సిన విషయం. ఇది దేశానికి మంచి చేసే చర్య. కరోనా లాంటివి భవిష్యత్తులో ఏమి వచ్చినా సరే తట్టుకుని నిలబడే విధంగా వైద్య రంగం తయారు కావాలన్నారు. దీనికోసం ప్రధాన మంత్రి చొరవ తీసుకోవాలని సీఎం కేసీఆర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్రం కలిసికట్టుగా పని చేసి, దేశంలో వైద్య సదుపాయాలు పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని,. రాష్ట్రంలో రికవరీ రేటు 71 శాతం ఉందన్నారు. మరణాలు రేటు 0.7 శాతం ఉంది. పరీక్షల సంఖ్యను గణనీయంగా పెంచాం. కరోనా సోకిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. కావల్సినన్ని బెడ్లు, మందులు, ఇతర పరికరాలు,సామగ్రి సిద్ధంగా ఉంచాం. ఐసీఎంఆర్, నీతి ఆయోగ్, కేంద్ర బృందాల సలహాలు పాటిస్తున్నాం. వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఇతర ప్రభుత్వ యంత్రాంగం అంతా శక్తి వంచన లేకుండా పని చేస్తున్నదని ముఖ్యమంత్రి వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, వైద్య శాఖ విభాగాధిపతులు శ్రీనివాస రావు, రమేశ్ రెడ్డి, గంగాధర్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, పంజాబ్, బీహార్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రులు మాట్లాడారు.

పంజాబ్‌లో విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు

నేడు పంపిణీ చేయనున్న సిఎం అమరీందర్

చండీఘడ్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): పంజాబ్ రాష్ట్రంలో విద్యార్థులకు ఉచితంగా స్మార్ట్ ఫోన్లు అందించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ నిర్ణయించారు. ఈ నెల 12వతేదీన పంజాబ్ రాష్ట్రంలోని 26 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు.రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేయనున్నారు. పంజాబ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12వతరగతి చదవుతున్న విద్యార్థినీ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లను అందిస్తామని పంజాబ్ సర్కారు గతంలోనే ప్రకటించింది.కరోనా సంక్షోభ సమయంలో ఆన్ లైన్ లో చదువుకుంటున్న విద్యార్థులకు సమస్యగా మారడంతో జన్మాష్టమి రోజు ఉచితంగా స్మార్ట్ ఫోన్లను అందించాలని సీఎం నిర్ణయించారు. ఆగస్టు 12వతేదీన అంతర్జాతీయ యువ దినోత్సవం కూడా రావడంతో ఆ సందర్భంగా స్మార్ట్ ఫోన్ల పంపిణీ చేయాలని నిర్ణయించారు. మొదటి దశ కింద రాష్ట్రంలో 1.75 లక్షల మంది విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేయాలని నిర్ణయించారు. దీనిలోభాగంగా 50వేల ఫోన్లను ఇప్పటికే తెప్పించారు. . జనం గుమిగూడకుండా భౌతిక దూరం పాటించేలా స్మార్ట్ ఫోన్లను విద్యార్థులకు పంపిణీ చేయాలని సీఎం నిర్ణయించారు

కులవృత్తులను బలోపేతం చేసేందుకు ప్రోత్సాహం

మత్స్యకారులకు ఆర్థికంగా అండగా నిలిచేలా పథకాలు
జలాశయంలో చేపలు వదిలిన మంత్రులు అల్లోల,తలసాని

నిర్మల్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కుల వృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్ , అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిలు అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని అన్నారు. మంగళవారం మంత్రులు తలసాని, అల్లోల గాంధీనగర్ గ్రామ శివారులోని శ్రీరాంసాగర్ రిజర్వాయర్ ఎగువన ఉన్న జలాశయంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక మత్స్యకారులకు అన్నిరకాలుగా ప్రయోజనం జరిగిందని, మత్స్యకారుల జీవితాల్లో కేసీఆర్ వెలుగు నింపారని తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారులకు పూర్తి స్థాయిలో అన్ని రకాలుగా 100 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. ముఖ్యంగా వారికి కావాల్సిన మోపెడ్ లు, వలలు, వాహనాలు, చేప పిల్లలు, ఐస్ బాక్సులు తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందన్నారు. మత్స్య రంగంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న లక్షలాది కుటుంబాలు ఎంతో ఆనందంగా ఉన్నాయని తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రంలోని 81 కోట్ల చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు . ప్రతి సంవత్సరం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ లోకి 5 కోట్ల చేప పిల్లలను విడుదల చేస్తున్నామన్నారు.

నిర్మల్ మత్స్యకారుల కోసం కోటి రూపాయాలతో మత్స్యకార భవన్ నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం అంతకుముందు నిర్మల్ పట్టణంలో విజయ డెయిరీ పార్లర్ ను మంత్రులు, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి ప్రారంభించారు.

రాష్ట్రంలో కొత్తగా 1,896 కరోనా కేసులు

గడిచిన 24 గంటల్లో కరోనాతో 8 మంది మృతి

హైదరాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. అయినా కరోనా కంట్రోల్‌కు తీసుకుంటున్న చర్యలతో రికవరీ కూడా పెరుగుతోంది. రాష్ట్రంలో కొత్తగా 1,896 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి.

గడిచిన 24 గంటల్లో కరోనాతో 8 మంది మృతి చెందారు. దీంతో తెలంగాణలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 82,647కు చేరుకోగా...645 మరణాలు సంభవించాయి. ప్రస్తుతం తెలంగాణలో 22,628 యాక్టివ్ కేసులు నమోదు అయ్యాయి. అలాగే కరోనా నుంచి కోలుకుని 59,374 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పటి వరకు తెలంగాణలో 6,42,875 కరోనా టెస్టులు నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా 338 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. అలాగే రంగారెడ్డి 147, కరీంనగర్ 121, మేడ్చల్ 119, వరంగల్ అర్బన్ 95, గద్వాల్ 85, జనగామ 71, కామారెడ్డి 71, పెద్దపల్లి 66 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఇదిలావుంటే కరోనా కట్టడి ప్రాంతాల నిర్వహణ విషయంలో ఢిల్లీ తరహా చర్యలు తీసుకోవాలని రాష్ట్రానికి కేంద్ర బృందం రాషట్రానికి సూచించింది. అక్కడ తీసుకుంటున్న చర్యలు, చేపడుతున్న కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. నీతి ఆయోగ్ సభ్యుడు డా.వినోద్‌కుమార్ పాల్, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి ఆర్తి అహూజ, డాక్టర్ రవీంద్రన్‌లతో కూడిన బృందం రెండురోజుల పాటు రాష్ట్రంలో పర్యటించి పలు అంశాలపై చర్చించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్, జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించింది. ఈసందర్భంగా కొవిడ్ కట్టడి ప్రాంతాల్లో ఢిల్లీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను రాష్ట్రంలోనూ అమలు చేయాలని సూచించింది. హోం ఐసోలేషన్‌లో ఉంటున్న కొవిడ్ రోగుల కోసం 'హితం' యాప్‌ను ప్రవేశపెట్టి టెలీ మెడిసిన్ పద్ధతిన ఔషధాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుండటాన్ని కేంద్ర బృందం ప్రశంసించింది. రాష్ట్రంలో టెస్టింగ్‌ల సంఖ్యను పెంచారని, ఇది వైరస్ నియంత్రణకు అత్యంత కీలకమన్నారు. కరోనా నియంత్రణకు అనుసరించాల్సిన వ్యూహాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైరస్ కట్టడికి చర్యలు తీసుకోవాలని సూచించిది.

యశోదా ఆస్పత్రి వద్ద ఉద్రిక్త

ఆసుపత్రి దోపిడీని నిరసిస్తూ బిజెవైఎం ఆందోళన

హైదరాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): కరోనా పేరుతో అక్రమ వ్యాపారం చేస్తూ పేద ప్రజలను దోచుకుంటున్న యశోద ఆసుపత్రిని వెంటనే సీజ్ చేయాలంటూ బీజేవైఎం నాయకులు ఆందోళనకు దిగారు. దీంతో యశోదా ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. కోవిడ్ నిబంధనలు, చట్టాలకు విరుద్ధంగా కరోనా రోగుల నుంచి 15 లక్షల నుంచి 50 లక్షలు గుంజుతున్నారంటూ ఆరోపిస్తున్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో మలక్‌పేట యశోద ఆసుపత్రి ముందు కార్యకర్తలు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రైవేట్ ఆసుపత్రులతో కలిసి ఈ సర్కార్ ప్రజల రక్తాన్ని పీలుస్తోందని బీజేవైఎం నేతలు ఆరోపించారు.

కరోనాతో ఇస్కాన్ ఆలయం మూసివేత

లక్నో,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): శ్రీకృష్ణాష్టమికి ఒక్కరోజు ముందు ఉత్తరప్రదేశ్ బృందావన్‌లోని ఇస్కాన్ ఆలయాన్ని మూసేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయ పూజారితోపాటు 22 మంది కరోనా బారిన పడడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఆలయంలో పనిచేసే వ్యక్తికి ఇటీవల కరోనా పాజిటివ్ వచ్చింది. కాంటాక్టులను గుర్తించి పరీక్షలు చేయగా పూజారితోపాటు 22 మంది వైరస్ బారినపడినట్లు నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. వీరిని ఐసోలేషన్లో ఉంచామని, ఆలయంలోకి ఎవ్వరూ రాకుండా నియంత్రిస్తున్నామని వారు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బుధవారం శ్రీకృష్ణాష్టమి జరుపుకోనున్న సంగతి తెలిసిందే. పురాణాల ప్రకారం.. శ్రీకృష్ణుడు అర్ధరాత్రి జన్మించాడని, విష్ణుమూర్తి ఎనిమిదో అవతారం అని నమ్ముతారు. హిందూ సంప్రదాయం ప్రకారం భాద్రపద మాసంలోని ఎనిమిదో రోజు వచ్చే అష్టమి తిథిని శ్రీకృష్ణాష్టమిగా జరుపుకోవడం ఆనవాయితి.

కాళేశ్వరంతో నీటి సమస్యలు తీరాయి: పద్మా

మెదక్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా గ్రామాల్లో వేసవిలోనూ చెరువులు నిండిపోతున్నాయని, ఇది తీమకెంతో గర్వకారణమని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అనన్నారు.

మంత్రి హరీష్ రావుతో కలసి ఎమ్యెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో పర్యటించారు. ఈ సందర్భంగా సి.సి రోడ్డు, డంప్ యార్డ్, గ్రామ పంచాయతీ భవనం, వైకుంఠధామం ప్రారంభోత్స కార్యక్రమాలను నిర్వహించారు. ధర్మారం గ్రామ చెరువులో 1 లక్ష 76వేల చేపపిల్లలను వదిలారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 1596 చెరువులలో ఐదు కోట్ల చేపపిల్లలను ఉచితంగా అందజేస్తున్నాం అని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. గతంలో చెరువులు నిండితేనే చేప పిల్లల పెంపకం జరిగేది కానీ నేడు ప్రాజెక్టుల ద్వారా చెరువులను నింపడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే పద్మ అన్నారు. ఇప్పటికే మెదక్ జిల్లాలో 400 చెరువులు నీటితో నిండాయి. మత్స్యకారులకు ప్రమాద బీమా సౌకర్యం ఆరు లక్షల రూపాయలకు పెంచాం. గతంలో ఇతర రాష్ట్రాల నుండి చేపలను దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేది కానీ కానీ నేడు ఇతర దేశాలకు చేపలను ఎగుమతి చేసే విధంగా మత్స్యకారులను అభివృద్ధి చేస్తున్నాం అని వెల్లడించారు

తండ్రి ఆస్తి హక్కులో కూతుళ్ళకూ సమాన వాటా

వారు ఎప్పటికీ హక్కుదారులే అన్న సుప్రీం
సంచలన తీర్పును వెలువరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన, సంఘంలో గౌరవం, కుటుంబంలో సమానత్వం వంటి విషయాల్లో మరొక ముందడుగు పడింది. కూతురు ఎప్పటికీ కూతురేనని, తండ్రి ఆస్తిలో వాటా పొందేందుకు హక్కుదారేనని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. హిందూ వారసత్వ సవరణ చట్టం, 2005 అమల్లోకి రావడానికి పూర్వమే తండ్రి మరణించినప్పటికీ, ఆ తండ్రి ఆస్తిలో వాటా పొందే హక్కు ఆయన కుమార్తెకు ఉంటుందని, ఆమె సమష్టి కుటుంబ భాగస్థురాలేనని స్పష్టం చేసింది.

హిందూ వారసత్వ సవరణ చట్టం, 2005 అమలు గురించి భిన్నాభిప్రాయాలు రావడంతో జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం వివరణ ఇచ్చింది. ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి హిందూ కుటుంబంలోని కుమార్తె సమష్టి కుటుంబ సహభాగస్థురాలు అవుతుంది. కానీ ఈ చట్టం అమల్లోకి రావడానికి ముందు తండ్రి మరణించినపుడు ఆయన కుమార్తెకు ఈ హక్కు ఉంటుందా? అనే అంశంపై స్పష్టత లేదు. దీనిపై మంగళవారం అత్యున్నత న్యాయస్థానం వివరణ ఇచ్చింది. ఈ వివరణతో మహిళలకు కుటుంబంలో సమాన గౌరవం, హోదా, హక్కులు లభిస్తున్నాయి. ప్రకాశ్ వర్సెస్ ఫూల్‌వతి కేసులో సుప్రీంకోర్టు 2016లో ఇచ్చిన తీర్పు ప్రకారం, ఈ చట్టం అమల్లోకి రాకముందు కుమార్తెలకు హక్కులు ఉండవు. దానమ్మ వర్సెస్ అమర్ కేసులో సుప్రీంకోర్టులోని వేరొక ధర్మాసనం 2018లో ఇచ్చిన తీర్పు ప్రకారం, ఈ చట్టం అమల్లోకి రావడానికి ముందు తండ్రి మరణించినప్పటికీ, ఆయన ఆస్తిలో ఆయన కుమార్తెకు హక్కు ఉంటుంది, ఆమె ఆ సమష్టి కుటుంబ సహభాగస్థురాలే. ఈ రెండు తీర్పులు విభిన్నంగా ఉండటంతో దీనిపై వివరణ కోరారు. దీంతో జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం వివరణ ఇచ్చింది. ఈ చట్టంలోని సెక్షన్ 6 ద్వారా కుమార్తెలకు కల్పించిన సమానత్వ హక్కును పోగొట్టరాదని జస్టిస్ అరుణ్ మిశ్రా ధర్మాసనం స్పష్టం చేసింది. 2005 సెప్టెంబరు 9 నుంచి హిందూ వారసత్వ సవరణ చట్టం, 2005 అమల్లోకి వచ్చింది. తమ తండ్రి ఆస్తిలో తమ అన్నదమ్ములతో సమాన వాటా కోరే అక్కచె÷-లలెళ్ళ వ్యాజ్యాలను పరిష్కరించేందుకు ఈ తేదీనే కొలబద్దగా న్యాయస్థానాలు పరిగణిస్తున్నాయి. ఈ అంశంపై పెండింగ్‌లో ఉన్న విచారణలను 6 నెలల్లోగా పూర్తి చేయాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆస్తి పంపకాల విషయంలో చాలా ఏళ్లుగా కూతుళ్లకు అన్యాయం జరుగుతూనే ఉంది. తండ్రి ఆస్తిని కుమారులకు మాత్రమే పంచుతున్నారు. కూతుళ్లకు వాటా ఇవ్వడం లేదు. ఆడపిల్లలకు సమాన వాటా ఇవ్వాలని హిందూ వారసత్వ సవరణ చట్టం-2005 చెబుతున్నా ఇప్పటికీ చాలా మంది ఆడపిల్లలకు న్యాయం జరగడం లేదు. ఈ క్రమంలో మంగళవారం సుప్రీం సంచలన తీర్పు వెలువరించింది. తండ్రి ఆస్తిలో ఆడపిల్లలకూ సమాన వాటా పంచాల్సిందేనని స్పష్టం చేసింది.

ఆర్థికవ్యవస్థ తిరిగి కోలుకుంటుంది : కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ఢిల్లీ , ఆగష్టు 11: భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే దారిలో పడుతున్నదని, ఎగుమతుల్లో మంచి పురోగతి సాధిస్తున్నామని, అదేసమయంలో దిగుమతులు తగ్గుముఖం పడుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. కరోనా మహమ్మారితో కుదేలైన ఆర్థికవ్యవస్థ తిరిగి కోలుకుంటుందనే సంకేతాలు స్పష్టంగా వస్తున్నాయన్నారు. ఆయన ఫిక్కీ నిర్వహించిన వర్చువల్ ఎఫ్ఎంసీజీ సప్లై చైన్ ఎక్స్‌పోలో మాట్లాడారు. గత నెలలో ఎగుమతులు మంచి వృద్ధిని కనబరిచాయని గోయల్ చెప్పారు. 2019 జూలైలో నమోదైన ఎగుమతుల్లో 91శాతానికి చేరుకున్నట్లు వెల్లడించారు. దిగుమతులు డెబ్బై శాతం నమోదయ్యాయన్నారు. విదేశాల్లోని అవకాశాలను అందిపుచ్చుకోవడంపై భారత పారిశ్రామికరంగంలో నమ్మకం ఏర్పడిందన్నారు. ఇది మరింత వృద్ధికి సహకరిస్తుందన్నారు. పెట్రోలియం, టెక్స్‌టైల్ రంగాలలో మందగమనం కారణంగా జూన్ వరకు వరుసగా నాలుగు నెలలు ఎగుమతులు తగ్గుముఖం పట్టాయన్నారు. వాణిజ్యంలో మిగులు నమోదయిందని గోయల్ చెప్పారు. జూన్ నెలలో 790 మిలియన్ డాలర్ల ట్రేడ్ సర్‌ప్లస్ నమోదయిందన్నారు. 18 ఏళ్లలో ఇలా మిగులు ఉండటం తొలిసారి అన్నారు. కరోనా మహమ్మారి కారణంగా చమురుకు డిమాండ్ లేకపోవడం, పసిడి దిగుమతులు తగ్గడం, ఇతర ఇండస్ట్రియల్ ఉత్పత్తులు తగ్గడం వంటి వివిధ కారణాలతో దిగుమతులు తగ్గినట్లు చెప్పారు. తయారీ, పారిశ్రామిక రంగాలను ప్రోత్సహించేందుకు కేంద్రం చేపడుతున్న చర్యలు ఇందుకు ఎంతగానో దోహదం చేస్తున్నాయన్నారు.

సీఎం కేసీఆర్ మానస పుత్రిక మిషన్ భగీరథ

రంగారెడ్డి, ఆగష్టు 11: రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మిషన్ భగీరథ పథకం కింద చేపట్టిన పనులన్నింటిని ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మిషన్ భగీరథ పనుల పురోగతిని రెండు జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులతో కలిసి అధికారులతో మంత్రి సమీక్షించారు.

సీఎం కేసీఆర్ మానస పుత్రిక మిషన్ భగీరథచేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కొడంగల్ నరేందర్ రెడ్డి, వికారాబాద్ ఆనంద్, పరిగి మహేష్ రెడ్డి, ఇబ్రాహీంపట్నం మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కల్వకుర్తి జైపాల్ యాదవ్ లతోపాటు వికారాబాద్ కలెక్టర్ పౌసమి బసు, రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ డా. హరీష్, మిషన్ భగీరథ ఇంజినీర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ మానస పుత్రిక అయిన మిషన్ భగీరథ పెండింగ్ పనులన్నీ నెలాఖరు లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యాన్ని సహించేది లేదన్నారు. పనులు నాణ్యతో సకాలంలో పూర్తి చేయాలన్నారు.

రాయలసీమను ఆదుకోవడమే కెసిఆర్ లక్ష్యం: వంశీచంద్

హైదరాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): రాయలసీమకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు అందించడమే లక్ష్యంగా సిఎం కెసిఆర్ కంకణం కట్టుకున్నారని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి ఆరోపించారు. రాయలసీమను రతనాల సీమగా చేయడానికి తెలంగాణ సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లుందని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ దక్షిణ తెలంగాణకు అన్యాయం చేసే చర్యలను ఖండిస్తున్నామన్నారు. ఏపీ చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం టెండర్లను అడ్డుకోవడంలో ప్రభుత్వ తీరుపై సందేహాలున్నాయన్నారు. కేసీఆర్‌కు రాష్ట్ర ప్రయోజనాల కంటే కాంట్రాక్టర్ల ప్రయోజనాలే ముఖ్యమయ్యాయని వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. అందుకే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయించారన్నారు. ప్రజల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చర్చకు రాకపోతే కేసీఆర్ కాంట్రాక్టర్ల ప్రతినిధిగా పనిచేస్తున్నారనే ఆరోపణలు నిజమని స్పష్టం అవుతోందని వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు.

పూలే విగ్రహం ధ్వంసం: విహెచ్ ఆగ్రహం

వరంగల్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): వరంగల్‌లోని కరిమాబాద్‌లో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ధ్వంసమైన విగ్రహాన్ని సందర్శించేందుకు వస్తున్న కాంగ్రెస్ నేత హన్మంతరావును జనగామ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ డిమాండ్ చేశారు.

చరిత్రలో నేటినిజం

కం॥ ఆత్రేయ సారాభాయి...క
పత్రి పదాత్రేయ నకు...ఘన పైదుష్మమునూ
సత్రేయి పథమున నడువగ
చత్రియె ముద మొంది యెసగె శాస్త్రజ్ఞ కళ్యన్!!

(ఆగష్టు 12 విక్రమ్ సారాభాయ్ జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

రష్యా నుంచే తొలి దివిటీ వెలగనుందా!

నేటినిజం
బుధవారం 12-8-2020

కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలను అతలాకుతలం చేస్తోంది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరిని ముంచేస్తోంది. ప్రజల్లో మానవసంబంధాలు దెబ్బ తినడం, కరోనా సోకిన మనిషిని మనిషిగా చూడక పోవడం లాంటి కారణంగా వ్యాక్సిన్ త్వరగా వస్తే తప్ప బంధాలు నిలిచేలా లేవు. అలాగే భారత్ లాంటి దేశంలో పనిచేసుకుంటే తప్ప పూటగడవని పరిస్థితి ఏర్పడింది. కోట్లాదిమంది రోడ్డున పడ్డారు. కరోనాకు మందు ఉందంటే ఇక మామూలు పరిస్థితిలోకి రాగలం. ప్రపంచ దేశాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఏర్పడిన క్రమంలో ...వైరస్‌ను తుదముట్టించే వ్యాక్సిన్ కోసం ఇప్పటికే ప్రపంచ దేశాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి.

కరోనా వల్ల కలిగిన ఆర్థిక వినాశనం నుంచి కోలుకోవడం అంత తేలిక కాదు. కాకపోతే ఈ వైరస్ వైద్య రంగంలో ఎన్నో నూతన ఆవిష్కరణలు వెలుగులోకి రావడానికి సాయం చేసింది. నూతన చికిత్సా విధానాలు, వ్యాక్సిన్ పరిశోధనల్లో పురోగతి జరిగింది. ప్రజలను ఆరోగ్య పరంగా అప్రమత్తం చేసింది. శుచిశుభ్రతలు పాటించేలా చేసింది. అలాగే బలవర్ధకమైన ఆహారపు అలవాట్లను గుర్తు చేసింది. జంక్‌ఫుడ్ జోలికి పోకుండా..గడ్డీగాదం తినకుండా కూడా చేసింది. సామాజికంగా ఇదో మంచి పరిణామంగా చూడాలి. ఈ క్రమంలో ప్రజలు తిరిగి మామూలు మనుషులు కావాలంటే వ్యాక్సిన్ రావాల్సి ఉంది. అది వస్తే తప్ప ధైర్యంగా గడపదాటే పరిస్థితులు రావు. ఈ క్రమంలో మనదేశంలో ఆగస్టు 15 నాటికి వ్యాక్సిన్ తీసుకుని రావాలని ప్రయత్నిస్తున్నారు. ఇందుకు భారత్ బయోటెక్ రూపొందించిన కోవాక్సిన్ క్లినికల్ ట్రయల్స్ వేగంగా సాగుతున్నాయి. అనేక దేశాలు గతంలో ఎప్పుడూ లేనంతగా వ్యాక్సిన్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. పరిశోధనలు ముమ్మరం చేశాయి. ఎవరికి వారు తమ మేధస్సును పెట్టి పనిచేస్తున్నారు. ఇదే క్రమంలో రష్యా ఓ అడుగు ముందుకు వేసి తామే ముందు వ్యాక్సిన్‌ను అందించబోతున్నట్లు చేసిన ప్రకటన ప్రజల్లో ఆశలు నిలిపింది. ఎట్టకేలకు కరోనా నియంత్రణకు ఓ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుందని రాష్ట్రా ఆరోగ్యశాఖ చేసిన ప్రకటనపై ప్రపంచ ప్రజలంతా ఆసక్తిగా చూస్తున్నారు. గమ్ కోవిడ్ వ్యాక్ లయో పేరుతో రష్యా తయారు చేసిన ఈ టీకాపై పలువురికి సందేహాలు ఉన్నప్పటికీ దాని వివరాలు ఒక్కటొక్కటిగా వెల్లడవుతున్నాయి. ముందుగా అనుకున్నట్టుగానే తాము ఆగస్టు 12న.. అంటే బుధవారం కరోనా టీకాను విడుదల చేస్తున్నట్లు రష్యా ఆరోగ్య శాఖ నిర్ధారించింది. దేశంలోని ప్రతి ఒక్కరికీ ఈ టీకాను ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ వారంలోనే వ్యాక్సిన్‌ను నమోదు చేసే పక్రియ పూర్తవుతుం దని ఆ శాఖ స్పష్టం చేసింది. ఆ తరువాత మూడు రోజులకు ఈ టీకా అందరికీ అందుబాటులోకి వచ్చినట్లేనని తెలిపింది. రష్యాలోని గమలేయా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖలు ఈ టీకా తయారు చేశాయి. టీకా వేసుకున్న తరువాత 21వ రోజుకు వైరస్‌ను అడ్డుకునేలా రోగనిరోధక వ్యవస్థ బలోపేత మైందని, రెండో డోస్‌తో ఇది రెట్టింపు సామర్థ్యం సంతరించుకుందని సమాచారం. ఈ టీకాను అడినోవైరస్ భాగాలతో చేసినట్లుగా స్పుత్నిక్ వార్తా సంస్థ తెలిపింది. నవంబర్ నాటికి అందరికీ టీకా అందుతుందని రష్యా ఆరోగ్యశాఖ చెబుతోంది. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థ రష్యా టీకా ప్రకటనలపై ఆందోళన వ్యక్తం చేసింది. సురక్షితమైన, సమర్థమైన టీకా అభివృద్ధికి తాము సూచించిన మార్గదర్శకాలను పాటించా ల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ఎందుకంటే కోవిడ్ -19 సీజనల్‌గా వచ్చిపోయే వైరస్‌లాగా కనిపించడం లేదని, అందుకే దీన్ని కట్టడిచేయడం కష్టంగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర సేవల విభాగం డాక్టర్ మైఖేల్ రయాన్ వెల్లడించారు. ఈ వైరస్ ఏ సీజన్‌లో వస్తుందో చెప్పలేకపోతున్నామని, శ్వాస సంబంధిత వైరస్ ఇన్‌ఫ్లుయెంజా ప్రధానంగా శీతాకాలంలో వ్యాప్తి చెందుతుందని, అయితే కరోనా వైరస్ మాత్రం

వేసవిలో కూడా విజృంభిస్తోందని ఆయన అన్నారు. కొందరు శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు కరోనా వైరస్ ఎండ వేడిమికి తట్టుకోలేదని, వేసవి కాలంలో మనగలగ లేదని గతంలో ఊహించారు. వైరస్‌ని ఎంత అణచివేయాలని చూసినప్పటికీ అది తిరిగి విజృంభిస్తూనే ఉందని రయాన్ అన్నారు. ఈ దశలో ప్రపంచ దేశాలు చేస్తున్న ప్రయత్నాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇదే క్రమంలో పూణెళికు చెందిన సీరం ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ ఇండియా ఎస్ఐఐ అతితక్కువ ధరలో కోవిడ్-19 వాక్సీన్ అందుబాటులోకి తెచ్చేందుకు కీలక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ది వ్యాక్సిన్ అలయన్స్, బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్‌తో ఈ డీల్ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం వ్యాక్సిన్ తయారీ కోసం గేట్స్ ఫౌండేషన్ నుండి గవి ద్వారా 150 మిలియన్ డాలర్ల నిధులు సీరంకు అందుతాయి. ప్రధానంగా ఇండియాలో కరోనా కేసుల ఉధృతి పెరుగుతున్న తరుణంలో 10 కోట్ల మోతాదుల కరోనా వైరస్ వాక్సీన్లను తయారీ చేయనున్నామని ఎస్ఐఐ ఇప్పటి కే ప్రకటించింది. ఈ వ్యాక్సిన్ ఒక్కో డోస్ ధర గరిష్టంగా 3డాలర్లు అంటే సుమారు 225 రూపాయలు ఉంటుందని, వీటిని 92 దేశాల్లో గవికి చెందిన కోవ్యాక్స్ అడ్వాన్స్ మార్కెట్ కమిట్‌మెంట్లో అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది. 2021 చివరి నాటికి కోట్లాది వాక్సిన్లను అందించాలనేది ప్రధాన లక్ష్యమని తెలిపింది. 2021నాటికి అతి తక్కువ ధరలో ప్రపంచంలోని వెనుకబడిన దేశాలకు వ్యాక్సిన్ పంపిణీని వేగవంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కాగా ఎస్ఐఐ సంస్థతో తమవాక్సిన్ సరఫరా, లైసెన్స్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు నోవావాక్స్ ఈ వారంలో ప్రకటించింది. ఆక్స్‌ఫర్డ్ ఆస్ట్రాజెనెకాతో తయారీ ఒప్పందాలను ఎస్ఐఐ ఇప్పటికే కుదుర్చు కుంది. అటు దేశంలో చివరి దశ మానవ పరీక్షలకు ఆక్స్‌ఫర్డ్ ఆస్ట్రాజెనెకా టీకాకు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) అనుమతి లభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 2021 మే నాటికి చాలా దేశాల్లో కరోనా కనుమరుగవుతుంది మైక్రోసాఫ్ట్ కో ఫౌండర్, బిలియనీర్ బిల్ గేట్స్ అన్నారు. కరోనా వ్యాక్సిన్ కోసం బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ నిధులు సమకూర్చుతున్నది. సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఉత్పత్తి చేసే కొన్ని వ్యాక్సిన్లు ఆస్ట్రాజెనెకా, నోవావాక్స్ రెండింటికి గాను ఒక డోస్‌కి 3 డాలర్ల ధర నిర్ణయించారు. ఇది 90 కి పైగా దేశాలలో అందుబాటు లో ఉండనున్నట్లు సమాచారం. బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్‌తో పాటు దీని మద్దతు ఉన్న గవి కూడా ప్రపంచ దేశాలన్నింటికి వేగంగా.. సమానంగా కరోనా వ్యాక్సిన్ డెలివరీ చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. మొత్తంగా ఏ దేశానికి ఆదేశం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలి. రష్టా విడుదల చేసే వ్యాక్సిన్ కూడా తొలిదశకు విజయం చేకూరలని కోరుకోవాలి. ప్రపంచ ప్రజలను పీడిస్తున్న కరోనా పీడ విరగడ అయితే అంతకు మించిన ఆనందం మానవాళికి మరోటి ఉండబోదు.

ఉపరాష్ట్రపతి మూడోసంవత్సరం పదవీకాల విశేషాలపై పుస్తకాన్ని విడుదల చేయనున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీరాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్, ఆగష్టు 11:ఉపరాష్ట్రపతి శ్రీ ఎం.వెంకయ్యనాయుడు మూడో ఏడాది పదవీ కాల విశేషాలను వివరించే , 'కనెక్టింగ్, కమ్యూనికేటింగ్, ఛేంజింగ్' పుస్తకాన్ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఆగస్టు 11,2020న ఉపరాష్ట్రపతి నివాసంలో ఆవిష్కరించనున్నారు. శ్రీ వెంకయ్యనాయుడు ఆగస్టు 11న ఉపరాష్ట్రపతిగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుంటారు.

ఈ పుస్తకం ఎలక్ట్రానిక్ వర్షన్ ను (ఈ- బుక్ ను) కేంద్ర సమాచార ప్రసార శాఖమంత్రి శ్రీ ప్రకాశ్ జవదేకర్ విడుదల చేస్తారు. ఈ పుస్తకం సుమారు 250 పేజీలు పైగా ఉంటుంది. దీనిని సమాచార ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన పబ్లికేషన్సు డివిజన్ ప్రచురించింది.

ఈ పుస్తకంలో ఉపరాష్ట్రపతి వివిధ కార్యకలాపాలకు అక్షరరూపంతో పాటు చిత్రాలు కూడా ఉన్నాయి. ఉపరాష్ట్రపతి దేశ విదేశాలలో పర్యటన విశేషాలు, రైతులు,శాస్త్రవేత్తలు, డాక్టర్లు, యువత, పాలనాయంత్రాంగం, పరిశ్రమ నాయకులు, కళాకారులు ఇలా వివిధ వర్గాల వారితో వారు జరిపిన సంభాషణలు ఇందులో ఉన్నాయి.ఉపరాష్ట్రపతి విదేశీ పర్యటనలు, ప్రపంచ నాయకులతో వారి సమావేశాలు, వివిధ దేశాలలో భారత సంతతి నుద్దేశించి వారు చేసిన ప్రసంగాలు ఇందులో ఉన్నాయి.రాజ్యసభ చురుకుగా పనిచేసేందుకు శ్రీ వెంకయ్యనాయుడు తీసుకువచ్చిన మార్పులు, ఫలితంగా రాజ్యసభ పనితీరులో కనిపించిన మెరుగుదల కూడా ఇందులో ప్రస్తావించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఉపరాష్ట్రపతి తమ సమయాన్ని ఎలా వెచ్చించిందీ ఈ పుస్తకం చివరి చాప్టర్‌లో ప్రస్తావించారు. ఉపరాష్ట్రపతి తన స్నేహితులు, ఉపాధ్యాయులు, చిరకాల సన్నిహితులు, పాత, కొత్త తెలిసినవారు, బంధువులు, ఎంపీలు, ఆధ్యాత్మిక వేత్తలు, జర్నలిస్టులు, ఇతరులతో మాట్లాడి వారి క్షేమ సమాచారాలు తెలుసుకున్న విషయాలూ ఇందులో ప్రస్తావించారు. ఉపరాష్ట్రపతి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, పార్లమెంటు ఉభయ సభలలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రాజ్యసభలోని అందరు ఎంపీలతో టెలిఫోన్‌లో మాట్లాడారు.

చరిత్రాత్మక స్థాయిలో 15 లక్షలు దాటిన కోలుకున్నవారు

హైదరాబాద్, ఆగష్టు 11:భారత్ లో కోవిడ్ నుంచి కోలుకున్నవారి సంఖ్య చరిత్రాత్మకంగా ఈరోజు 15 లక్షలు దాటింది. పరీక్షలు దూకుడుగా చేపట్టటం, సమగ్రంగా ఆనవాళ్ళు పట్టటం, సమర్థంగా చికిత్స అందించటం కారణంగా ఇప్పటిదాకా 15,35,743 మంది బాధితులు కోలుకోగలిగారు. మెరుగైన అంబులెన్స్ సౌకర్యాలు, ప్రామాణిక చికిత్సావిధానాలమీద దృష్టి సారించటం, ఆక్సిజెన్ సరఫరా విధానం వాడకం ఈ సత్ఫలితాలకు కారణాలయ్యాయి.

గడిచిన 24 గంటల్లో నమోదైన ఒకేరోజు కోలుకున్నవారి సంఖ్య 54,859 కు చేరగా కోవిడ్ బాధితులలో కోలుకున్నవారి శాతం గరిష్ఠంగా దాదాపు 70% అయింది.

రికార్డు స్థాయిలో కోలుకున్నవారి సంఖ్య నమోదవుతూ ఉండగా ఇప్పటికీ ఇంకా చికిత్సలో ఉన్నవారి సంఖ్య తగ్గుతూ ఉంది. మొత్తం పాజిటివ్ కేసుల్లో వీరి శాతం ప్రస్తుతం 28.66% మాత్రమే ఉంది. ఆ విధంగా చికిత్సలో ఉన్న 6,34,945 మందికంటే 9 లక్షలమంది ఎక్కువగా కోలుకున్నవారు ఉన్నారు.

పరీక్షలు జరపటం మీద దృష్టి సారిస్తూ, కేంద్రంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చేస్తున్న ఉమ్మడి కృషి ఫలితంగానూ, ఆస్పత్రులలో అందిస్తున్న మెరుగైన చికిత్స కారణంగాను మరణాల సంఖ్య బాగా తగ్గుతూ వస్తుంది. మొత్తం పాజిటివ్ కేసుల్లో మరణాల శాతం ప్రస్తుతం 2 శాతానికి పరిమితమైంది. పైగా, ఇది క్రమంగా తగ్గుతూ వస్తోంది. ముందుగానే పాజిటివ్ కేసులను గుర్తించటం వలన ప్రస్తుతం చికిత్సలో ఉన్నవారి సంఖ్య బాగా తగ్గుతూ వస్తోంది.

త్వరగా గుర్తించటం వలన కొద్దిపాటి లక్షణాలు కనబరుస్తున్నవారిని సకాలంలో వారిని ఐసొలేషన్ కు పంపటం, ఒక మోస్తరు నుంచి తీవ్రమైన లక్షణాలు కనబరుస్తున్నవారిని ఆస్పత్రులకు తరలించటం లాంటి పనులు చక చకా జరిగిపోతున్నాయి. ఆ విధంగా అవసరమైన చికిత్స సమర్థంగా అందించటానికి వీలవుతోంది.

అయితే ఇప్పటికీ10 రాష్ట్రాలలో కోవిడ్ ఇన్ఫెక్షన్ ప్రభావ ఎక్కువగానే ఉంది. కొత్త పాజిటివ్ కేసుల్లో 80% ఆ రాష్ట్రాలలోనే నమోదవుతున్నాయి. ఇంటింటి సర్వే ద్వారా దూకుడుగా పరీక్షలు జరపటం వలన మొదట్లో కేసుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ, వ్యాధి నియంత్రణ దిశలో ఈ ప్రాంతాల్లో అనుసరిస్తున్న వ్యూహాలు క్రమంగా చికిత్సలో ఉన్నవారి సంఖ్యను తగ్గిస్తూ వచ్చాయి.

కోవిడ్ -19 మీద సాంకేతిక అంశాలు, మార్గదర్శకాలు, సూచనలతో కూడిన కచ్చితమైన తాజా సమాచారం కోసం క్రమం తప్పకుండా https://www.mohfw.gov.in/ మరియు @MoHFW_INDIA ను సందర్శించండి

కోవిడ్ -19 కు సంబంధించిన సాంకేతికమైన అనుమానాలుంటే technicalquery.covid19@gov.in కు పంపవచ్చు. ఇతర సమాచారం కావాల్సినవారు ncov2019@gov.in మరియు @CovidIndiaSevaను సంప్రదించవచ్చు

కోవిడ్ -19 మీద ఏవైనా ప్రశ్నలుంటే ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ హెల్ప్ లైన్ నెంబర్ +91-11-23978046 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1075 కు ఫోన్ చేయవచ్చు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల హెల్ప్ లైన్ నెంబర్ల కోసంhttps://www.mohfw.gov.in/pdf/coronavirushelplinenumber.pdf

అసోం డిజిపికి కరోనా పాజిటివ్

-అప్రమత్తం అయిన పోలీస్ శాఖ

గౌహతి,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): దేశంలో ఇప్పటి వరకు ఆయా రాష్ట్రాల్లో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్పీ స్థాయి అధికారుల వరకు కరోనా సోకిన విషయం విదితమే. కానీ తాజాగా ఓ డీజీపీకి కరోనా సోకింది. అసోం డీజీపీ భాస్కర్ జ్యోత్ మహంతాకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో ఆ రాష్ట్ర పోలీసు శాఖ అప్రమత్తమైంది. డీజీపీ ఆఫీసులో ఉన్న వారందరికీ కరోనా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఓ అధికారి తెలిపారు. అసోంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 58,838కి చేరగా, మృతుల సంఖ్య 145కు చేరింది. మొత్తం పాజిటివ్ కేసుల్లో 16,364 కేసులు యాక్టివ్‌లో ఉండగా, 42,326 మంది కరోనా మహమ్మారి నుంచి కోలుకున్నారు.

నీటి వాటాలపై కేసీఆర్ మరింత నిశిత దృష్టి

ఇక నేరుగా రంగంలోకి దిగేలా కార్యాచరణ
ఎపి, కేంద్ర వైఖరిని తూర్పార బట్టేలా రణనీతి
జాతీయ స్థాయిలో జలవిధానాలపై చర్చకు పట్టు

హైదరాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): పోతిరెడ్డిపాడుపై విపక్షాలు గురిపెట్టాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ఇక్కడున్న ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నాయి. రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో కావాలనే తెలంగాణ రాష్ట్ర సర్కార్ దాగుడు మూతలకు పాల్పడుతోంది. ఏపీ ప్రయోజనాలకు లబ్ది చేకూరేలా తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది అనేది ప్రధానంగా తెలంగాణలోని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు. దానికి వ్యతిరేకంగా ఏపీ ప్రభుత్వం... తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని... అపెక్స్ కౌన్సిల్‌లో ఏపీ ప్రభుత్వ తీరును ఎండగడ తామని... ఏపీతో పాటు కేంద్రం కూడా తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని నిన్న సీఎం కేసీఆర్ తెలిపారు.ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అండస్టాం÷-రడింగ్ ఉందని రెండు రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. అయితే రెండు రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ...అపెక్స్ కౌన్సిల్‌లో ఫిర్యాదులు చేసుకున్నాయి...ఈనెల 20న అపెక్స్ కౌన్సిల్ సమావేశం కూడా జరుగబోతోంది. అయితే ఎందుకు ఇక్కడున్న ప్రతిపక్షాలు... తెలంగాణలో ప్రభుత్వం చేస్తున్న చర్యలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దశలో సిఎం కెసిఆర్ నిర్వహించిన అధికారిక సమావేశంలో ఘాటుగానే స్పందించారు.చాలాకాలం తరవాత ఎపిపై సహజ ధోరణిలో మాట్లాడారు. రెండు రాష్ట్రాల రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రాజెక్టులు నిర్మించుకుందామని స్నేహ హస్తం అందించామని అన్నారు. సహజ సరిహద్దు రాష్ట్రాలు అయినందున స్నేహంగా మెదిలి, అంతిమంగా రైతులకు సాగునీరు అందించే లక్ష్యం సాధించాలని ప్రతిపాదిం చినా ఎపి దూకుడు వ్యవహారంపై ఇక ఉదాసీనంగా ఉండరాదన్న వైఖరిని కెసిఆర్ ప్రదర్శించారు. సముద్రం పాలవుతున్న నీటిని పొలాలకు మళ్లించే కార్యాచరణ అమలు చేద్దామని చెప్పాం. అయినా.. ఏపీ ప్రభుత్వం కెలికి కయ్యం పెట్టుకుంటున్నది. తెలంగాణ ప్రాజెక్టులపై అర్థంలేని వాదనలు, నిరాధార ఫిర్యాదులు చేస్తున్నది. అపెక్స్ కమిటీ భేటీలో ఏపీ ప్రభుత్వం నోరు మూయించేలా సమాధానం చెప్పనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. పనిలో పనిగా శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసే విషయంలో కూడా కేంద్రం అనవసరంగా అభ్యంతరం పెడుతున్నదని కెసిఆర్ మండిపడ్డారు వాస్తవానికి నాగార్జునసాగర్ నింపిన తర్వాతనే మిగిలిన ప్రాజెక్టులు నిండాలి. అసలు శ్రీశైలం ప్రాజెక్టు నీటిపారుదల ప్రాజెక్టు కాదు. అది జల విద్యుత్ ప్రాజెక్టు. ఇన్ని వాస్తవాలు పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం అభ్యంతరాలు వ్యక్తంచేయడం సమంజసం కాదన్నారు. తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి కూడా లోపభూయిష్టంగా ఉందన్నారు. మొత్తంగా ఈ వ్యవహారంలో అటు కేంద్రం పాత్రను, ఇటు ఎపి వైఖరిని కూడా రానున్న రోజుల్లో గట్టిగానే ఎదుర్కొనేలా కెసిఆర్ కార్యాచరణ చేస్తున్నారని అర్థం అవుతోంది. తెలంగాణకు ఉన్న నీటి వాటా ప్రకారమే ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. తెలంగాణ ఏర్పడేనాటికే నీటి కేటాయింపులు జరిగి, అనుమతులు పొంది, ఖర్చు కూడా జరిగిన ప్రాజెక్టుల విషయంలో అభ్యంతరాలు వ్యక్తంచేయడం ఏమాత్రం సరికాదు. ఒక రాష్ట్రంగా తెలంగాణకు కూడా హక్కులు ఒంటాయి. తనకున్న హక్కు ప్రకారం ప్రాజెక్టులు నిర్మిస్తున్నది. ఈ విషయంలో రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్రం వ్యవహరించడం తగదు. కేంద్ర వైఖరిని కూడా యావత్ దేశానికి తెలిసేలా చేస్తామని కెసిఆర్ పట్టుదలతో ఉన్నారు. నీటి వినియోగంపై స్పష్టమైన వైఖరితో ఉన్న కెసిఆర్ మరోమారు తన విశ్వరూపం చూపే అవకాశాలు ఉన్నాయి. త్వరలో జరుగనున్న అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ప్రాజెక్టుల నిర్మాణాలపై పూర్తి వాస్తవాలు, సంపూర్ణ సమాచారం వెల్లడించి.. ఆంధ్రప్రదేశ్, కేంద్ర ప్రభుత్వాల నోరు మూయిస్తామని సీఎం చేసన వ్యాఖ్యల ఆంతర్యం ఇదేనని భావించాలి. సమర్థ వాదనలతో తెలంగాణ ప్రాజెక్టులపై నోరెత్తి మాట్లాడలేని పరిస్థితిని కల్పిస్తామని కూడా స్పష్టంచేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వైఖరిని ఖరారు చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో సోవవారం జల వనరులశాఖ అధికారులతో సమావేశమయిన సందర్భంగా చర్చించా అంశాలను పరిశీలిస్తే ఆయన ధృఢ వైఖరిని అర్థం చేసుకోవచ్చు.

సీఎం కేసీఆర్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారు: ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ , ఆగష్టు 11: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతులు చాలా సంతోషంగా వ్యవసాయం చేసుకుంటూ బంగారు పంటలు పండిస్తున్నారని నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పరిధిలో ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువలు 39, 40కు మంగళవారం ఆయన సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో చివరి ఆయకట్టు రైతులకు కూడా సాగు నీరు అందుతున్నదని అన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గత యాసంగి సీజన్‌లో తెలంగాణలో రికార్డుస్థాయి పంటలు పండాయన్నారు. ఎఫ్‌సీఐ కొనుగోలు చేసిన ధాన్యంలో 65 శాతం తెలంగాణా రాష్ట్రం నుంచే ఉన్నట్లు గుర్తు చేశారు. లాక్‌డౌన్ క్లిష్ట సమయంలో రైతులు ఇబ్బందులు పడకుండా పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసిందని చెప్పారు. కరోనా సంక్షోభంలోనూ పెట్టుబడి సాయం అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, తిప్పర్తి ఎంపీపీ విజయలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు, ముఖ్య నాయకులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

తమిళనాట అప్పుడే ఎన్నికల వేడి

అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహాల్లో పార్టీలు
డిఎంకె వైపు మొగ్గుచూపుతున్న కమలహాసన్?

చెన్నై,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ ఎన్నికలకు ఇక ఆరునెలల గడువు మాత్రమే ఉండడంతో నటుడు కమలహాసన్ తాను స్థాపించిన పార్టీని చైతన్యం చేసేలా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే తమిళనాట డిఎంకె మంచి పట్టు సాధించింది. స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె అధికారం చేజిక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న డీఎంకేకు రాబోయే అసెంబ్లీ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. అగ్రనేత కరుణానిధి కన్నుమూసిన తరువాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సాధించిన విజయం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అసెంబ్లీ ఎన్నికల్లో సైతం అదే విజయాన్ని పునరావృతం చేయగలమనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ అభ్యర్థులు గెలవడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మురుగన్ ధీమాతో ఉన్నారు. ఒక్క రజనీకాంత్ మినహా అందరూ అసెంబ్లీ ఎన్నికలవైపు ఆశగా ఎదురుచూస్తున్నట్లు సమాచారం. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో చేరేందుకు మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు, నటుడు కమల్‌హాసన్ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీని స్థాపించినప్పుడే ఢిల్లీ వెళ్లి నేరుగా కాంగ్రెస్ అధినేతలు సోనియాగా ంధీ, రాహుల్‌గాంధీని కమల్ కలిసి వచ్చారు. కూటమికి సారధ్యం వహిస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌తో మాటమాత్రం అనకుండా అధిష్టానం వద్దకు వెళ్లడంతో వ్యవహారం చెడింది. దీంతో కమల్ ఈ నెల 7వ తేదీన కరుణానిధి వర్ధంతి రోజున ట్విట్టర్ ద్వారా నివాళులర్పించి గతంలో చేసిన పొరబాటును సరిదిద్దుకునే ప్రయత్నం చేశారు. కమల్ చేరిక డీఎంకేకు మరింత బలం చేకూరుస్తుందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. డీఎంకే కూటమిలో మక్కల్ నీది మయ్యం చేరడం ఎంతవరకు సాధ్యమనే సందేహాలు నెలకొన్ని ఉన్నాయి. నటుడు రజనీకాంత్ పార్టీని స్థాపించి అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతారా.. లేక కమల్‌తో కలుస్తారా, అదే జరిగితే రాజకీయ బలాబలాల మాటేమిటని కూడా ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరిస్తోంది. అందుకే అన్ని పార్టీల్లోనూ అప్పుడే ఎన్నికల వేడి రాజుకుంది. కొన్నిపార్టీలు ప్రత్యక్షంగా, మరికొన్ని పార్టీలు పరోక్షంగా ఎన్నికలకు సమాయత్తం అవుతున్నాయి. వరుసగా రెండుసార్లు అధికారం చేపట్టిన అన్నాడీఎంకే ముచ్చటగా మూడోసారి విజయకేతనం ఎగురవేయడం ద్వారా హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తోంది. పదేళ్లుగా అధికారానికి దూరం గా ఉన్న డీఎంకే ఈసారి ఎలాగైనా జార్జికోటపై జెండా ఎగురవేయాలని పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో ఏ కూటమికి విజయావకాశాలు మెండుగా ఉన్నాయన్న సర్వేలు ప్రారంభమయ్యాయి. ప్రధాన రెండు కూటములు (డీఎంకే, అన్నా డీఎంకే)లకు చెందిన ప్రముఖ నేతలను కలుసుకుంటూ సమాచారాన్ని సేకరిస్తున్నా రు. అలాగే, ఎమ్మెల్యేగా గెలుపు అవకాశాలు కలిగిన నేతలు, నియోజకవర్గాల గురించి ఆరాతీస్తున్నారు. అభ్యర్థుల ఎంపికలో అన్నాడీఎంకే, డీఎంకేలో జిల్లా కార్యదర్శు లకు లేదా వారు సూచించే వ్యక్తులకు ప్రాధాన్యతనిచ్చే సంప్రదాయం ఉంది. గత ఎన్నికల్లో పోటీ చేసి

అండమాన్ & నికోబార్ దీవుల కు (సిఎఎన్ఐ) సబ్ మరీన్ కేబుల్ కనెక్టివిటీ ని ప్రారంభించిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ మోదీ

హైదరాబాద్, ఆగష్టు 11:అండమాన్ ఉ నికోబార్ దీవుల ను ప్రధాన భూమి తో కలిపే సబ్ మరీన్ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఒఎఫ్ సి) ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ఈ రోజు న ప్రారంభించి మరి ఆ సదుపాయాన్ని దేశ ప్రజల కు అంకితమిచ్చారు. ఈ పరియోజన కు పోర్ట్ బ్లేయర్ లో 2018వ సంవత్సరం లో డిసెంబర్ 30 వ తేదీ నాడు ప్రధాన మంత్రి యే శంకుస్థాపన చేశారు.

ఈ సంధానం ఇక ఈ ద్వీపాల లో అనంతమైనటువంటి అవకాశాల ను కల్పిస్తుంది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. 2300 కి.మీ. సబ్ మరీన్ కేబుల్ ను వేయడం, మరి దీనికి సంబంధించిన పనులను నిర్దేశిత లక్ష్యం కంటే ముందుగానే పూర్తి చేయడం ప్రశంసనీయమని ఆయన అన్నారు.

చెన్నై నుండి పోర్ట్ బ్లేయర్ వరకు, పోర్ట్ బ్లేయర్ నుండి లిటిల్ అండమాన్, ఇంకా పోర్ట్ బ్లేయర్ నుండి స్వరాజ్ ఐలండ్ వరకు గల దీవుల లో ఒక చాలా పెద్ద భాగం లో ఈ యొక్క సేవ ఈ రోజు నుండి ప్రారంభం అయిందని ప్రధాన మంత్రి అన్నారు.

సముద్రం లోని లోతట్టు ప్రాంతం లో సర్వేక్షణ ను చేపట్టడం, కేబుల్ యొక్క నాణ్యత ను పరిరక్షించడం మరియు స్పెశలైజ్ డ్ వెసల్స్ తో కేబుల్ ను వేయడం వంటి కార్యభారాలు ఏమంత సులువైనవి కావు అందువల్ల సముద్రం లో దాదాపు 2300 కిలోమీటర్ల దిగువన కేబుల్స్ ను వేయడాన్ని మెచ్చుకోవలసిందే అని ప్రధాన మంత్రి అన్నారు. ఉవ్వెత్తున ఎగసిపడే అలలు, తుపానులు మరియు రుతుపవనాల వంటి సవాళ్ల ను అధిగమించవలసి ఉంటుందని, కరోనా విశ్వమారి నేపథ్యం లో కష్ట కాలాలు ఎదురయ్యాయని ఆయన అన్నారు.

అండమాన్ & నికోబార్ దీవులు చాలా సంవత్సరాలు గా దీని యొక్క ఆవశ్యకత ను గమనించినప్పటికీ ఈ అవసరాన్ని తీర్చడం కోసం ఎటువంటి చర్యల ను చేపట్టడం జరుగలేదు అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రధానమైనటువంటి సవాళ్ల కు ఎదురీది ఈ పరియోజన ను అప్పగించగలగడం పట్ల శ్రీ మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అండమాన్ & నికోబార్ దీవుల లో నివసిస్తున్న ప్రజల కు తక్కువ ఖర్చు తో కూడినటువంటి మరియు ఉత్తమమైనటువంటి సంధానం సదుపాయాన్ని సమకూర్చడం అనేది దేశం యొక్క బాధ్యత గా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ పరియోజన తో అనుబంధితులైన వారందరి ని ఆయన అభినందించారు. అండమాన్ ఉ నికోబార్ దీవులు దిల్లీ కి మరియు ప్రధాన భూమి యొక్క హృదయాల కు ఏమంత దూరం లో లేవు సుమా అని రుజువు చేసిన అట్లాంటి ఒక ప్రయాసే ఈ యొక్క సబ్ మరీన్ కేబుల్ అని శ్రీ మోదీ అభివర్ణించారు.

ప్రతి ఒక్క పౌరుని కి, ప్రతి ఒక్క పౌరురాలికి జీవించడంలో సౌలభ్యం

దేశం లో ప్రతి ఒక్క పౌరుని కి/ప్రతి ఒక్క పౌరురాలి కి, అలాగే ప్రతి ఒక్క రంగాని కి కూడాను ఆధునిక సదుపాయాల ను సమకూర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తద్ద్వారా జీవించడం లో సౌలభ్యం మెరుగుపడగలదని శ్రీ మోదీ అన్నారు. అండమాన్ ఉ నికోబార్ దీవుల ను దేశం లోని మిగిలిన ప్రాంతాల తో కలిపే ఈ ఆప్టికల్ ఫైబర్ ప్రాజెక్టు జీవించడం లో సౌలభ్యం దిశ గా ప్రభుత్వం యొక్క నిబద్ధత కు ఒక ఉదాహరణ గా నిలుస్తున్నదని ఆయన అన్నారు. జాతీయ భద్రత తో ముడిపడ్డ సరిహద్దు ప్రాంతాలు మరియు ద్వీప రాష్ట్రాల ను శరవేగం గా అభివృద్ధిపరచేందుకు ప్రభుత్వం వచనబద్ధమైందని ఆయన చెప్పారు.

డిజిటల్ ఇండియా ద్వారా అవకాశాల పెరుగుదల

అండమాన్ ఉ నికోబార్ దీవులు చౌక అయినటువంటి మరియు ఉత్తమమైనటువంటి సంధానాన్ని పొందడం లో, మరి డిజిటల్ ఇండియా యొక్క సకల ప్రయోజనాలు ప్రత్యేకించి ఆన్ లైన్ ఎజుకేషన్, టెలి-మెడిసిన్, బ్యాంకింగ్ వ్యవస్థ, ఆన్ లైన్ ట్రేడింగ్ ను మెరుగుపరచడం లో, అలాగే పర్యటన రంగానికి ఉత్తేజాన్ని ఇవ్వడం లో సబ్ మరీన్ కేబుల్ సహాయకారి కాగలదని ప్రధాన మంత్రి అన్నారు.

భారతదేశం యొక్క వర్తకానికి మరియు వ్యూహాత్మకమైన పరాక్రమాని కి వేల సంవత్సరాలు గా హిందూ మహాసముద్రం కేంద్ర స్థానం గా ఉందని, అదే మాదిరి గా అండమాన్ ఉ నికోబార్ దీవులు భారతదేశం యొక్క ఆర్థిక, వ్యూహాత్మక సహకారానికి ఒక ముఖ్య కేంద్రం గా ఉంటున్నాయని ప్రధాన మంత్రి అన్నారు.

ఇండో-పసిఫిక్ ప్రాంతం లో భారతదేశం అవలంబించే నూతన వర్తక వ్యూహం లో భారతదేశం యొక్క ద్వీపాలు అన్నీ కూడాను ఒక ముఖ్య పాత్ర ను పోషించగలవని ఆయన అన్నారు.

యాక్ట్- ఈస్ట్ పాలిసి లో భాగం గా, తూర్పు ఆసియా దేశాల తోను, సముద్రం తో జతపడ్డ ఇతర దేశాల తోను భారతదేశం యొక్క బలమైన సంబంధాల లో అండమాన్ ఉ నికోబార్ దీవుల పాత్ర ఎంతో ఉన్నతమైంది, మరి ఇది పెరగనుంది కూడా అని శ్రీ మోదీ అన్నారు.

ఈ దీవుల యొక్క పాత్ర ను బలపరచడం కోసం 3 సంవత్సరాల క్రితం ఐలండ్ డివెలప్ మెంట్ ఏజెన్సీ ని ఏర్పాటు చేయడమైంది అని ఆయన చెప్పారు. అండమాన్ ఉ నికోబార్ దీవుల లో పూర్తి కానటువంటి పరియోజనలు ఇప్పుడు శీఘ్ర గతి న పూర్తి అవుతున్నాయి అని ఆయన అన్నారు.

అధిక ప్రభావశీల పరియోజన లు మెరుగైన భూమి, వాయు మార్గాలు మరియు జలమార్గాలు

అండమాన్ & నికోబార్ లోని 12 దీవుల లో అధిక ప్రభావశీల పరియోజన లను విస్తరించడం జరుగుతోంది అని ప్రధాన మంత్రి అన్నారు. మెరుగైనటువంటి ఇంటర్ నెట్, ఇంకా మొబైల్ కనెక్టివిటి ని సమకూర్చడం తో పాటు రోడ్డు, వాయు మరియు జల మార్గాల ద్వారా భౌతిక సంధానాన్ని మరింత గా మెరుగుపరచే ప్రయాస కూడా జరుగుతున్నదని ఆయన తెలిపారు.

ఉత్తర అండమాన్ మరియు మధ్య అండమాన్ లో రోడ్డు సంధానాన్ని మెరుగుపరచడం కోసం ఎన్ హెచ్-4 ను వెడల్పు చేసే పనుల కు తోడు రెండు ప్రధానమైన వంతెన ల పనులు జరుగుతుండటాని ఆయన ప్రస్తావించారు.

ఒకే సారి 1200 ప్రయాణికుల ను హ్యాండిల్ చేసే సామర్థ్యాన్ని సంతరిస్తూ పోర్ట్ బ్లేయర్ విమానాశ్రయం యొక్క స్థాయి ని పెంచడం జరుగుతోందని ఆయన అన్నారు. దీనితో పాటు దిగ్లీపుర్, కార్ నికోబార్ మరియు క్యాంప్ బెల్ - బే లలో విమానాశ్రయాలు కార్యకలపాల ను నిర్వహించడం కోసం సిద్ధం గా ఉన్నాయన్నారు.

స్వరాజ్ ద్వీప్, శహీద్ ద్వీప్ మరియు లాంగ్ ఐలండ్ లలో ప్యాసింజర్ టర్మినల్ తో పాటు ఫ్లోటింగ్ జెట్టీ వంటి వాటర్ ఏరోడ్రోమ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కూడా రాబోయే మాసాల లో తయారు అవుతాయని శ్రీ మోదీ తెలిపారు.

కోచి శిప్ యార్డ్ లో నిర్మాణం లో ఉన్నటువంటి 4 నౌకల ను ద్వీపాల కు మరియు ప్రధాన భూమి కి నడుమ న జల సంధానాన్ని మెరుగుపరచడం కోసం త్వరలో అప్పగించడం జరుగుతుందని ఆయన అన్నారు.

నౌకాశ్రయాల నాయకత్వం లో అభివృద్ధి

ప్రపంచం లోని అనేక నౌకాశ్రయాల కంటే అండమాన్ ఉ నికోబార్ దీవులు స్పర్ధాత్మక దూరం లో ఉన్నందువల్ల, నౌకాశ్రయాల నాయకత్వం లో అభివృద్ధి కి నిలయం గా అండమాన్ ఉ నికోబార్ దీవుల ను తీర్చిదిద్దడం జరుగుతుందని ఆయన చెప్పారు.

మెరుగైన నౌకాశ్రయాల నెట్ వర్క్ మరియు ఆ నౌకాశ్రయాల సంధాన సౌకర్యాలు ఏ దేశం లో ఉంటాయో ఆ దేశం 21వ శతాబ్దం లో వర్తకానికి ఒక ఉత్తేజాన్ని అందించగలుగుతుంది అని ప్రధాన మంత్రి అన్నారు.

స్వయం సమృద్ధి సాధన సంకల్పం తో భారతదేశం ముందుకుపోతూ, గ్లోబల్ సప్లయ్ చైన్ లోను, గ్లోబల్ వేల్యూ చైన్ లోను ఒక ముఖ్య పాత్రధారి గా తనను తాను ప్రతిష్ఠితం చేసుకొంటున్న ప్రస్తుత తరుణం లో మన జలమార్గాలు మరియు నౌకాశ్రయాల యొక్క నెట్ వర్క్ ను పటిష్టం చేసుకోవడం చాలా ముఖ్యం అని ఆయన అన్నారు. నౌకాశ్రయాల సంబంధిత మౌలిక సదుపాయాల కల్పన యొక్క అభివృద్ధి లో న్యాయపరంగా ఎదురవుతున్న అడ్డంకుల ను కూడా ను అదే పని గా తొలగించడం జరుగుతున్నది అని శ్రీ మోదీ చెప్పారు.

అంతర్జాతీయ సముద్ర సంబంధి వ్యాపారం

సముద్రంలో వ్యాపార నిర్వహణ సంబంధిత సౌలభ్యాన్ని ప్రోత్సహించడం, ఇంకా మేరిటైం లాజిస్టిక్స్ ను సరళతరం చేయడం పైన కూడా ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందని ప్రధాన మంత్రి అన్నారు. డీప్ డ్రాఫ్ట్ ఇన్నర్ హార్బర్ ను త్వరిత గతి న నిర్మించడాన్ని గురించి మరియు గ్రేట్ నికోబార్ లో ట్రాన్స్ శిప్ మెంట్ పోర్ట్ ను దాదాపు గా 10,000 కోట్ల రూపాయల అంచనా వ్యయం తో నిర్మించే ప్రతిపాదన ను గురించి ఆయన ప్రస్తావించారు. దీని తో పెద్ద ఓడ లు లంగరు వేసుకు ఆగేందుకు వీలు కలుగుతుందని, మరి నూతన ఉద్యోగ అవకాశాల తో పాటు సముద్ర సంబంధి వ్యాపారం లో భారతదేశం యొక్క వాటా కూడా పెరుగుతుందని శ్రీ మోదీ అన్నారు.

అండమాన్ & నికోబార్ దీవుల లో అభివృద్ధిపరుస్తున్న ఆధునిక మౌలిక సదుపాయాల కు సమానమైన రీతి లో మత్స్యపరిశ్రమ, చేపలు/రొయ్యల పెంపకం, ఇంకా సముద్రపు కలుపుమొక్కల సాగు వంటి నీలి ఆర్థిక వ్యవస్థ వేగం గా వృద్ధి చెందగలదని ఆయన అన్నారు. ప్రభుత్వం యొక్క కృషి అండమాన్ ఉ నికోబార్ దీవుల కు ఒక్క నూతన సదుపాయాల ను అందించడమే కాకుండా ప్రపంచ పర్యటక పటం లో ఓ ప్రముఖ స్థానాన్ని కూడా కట్టబెట్టగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

తాను చేపట్టిన ఎపికి మూడు రాజధానులు

అమరావతి కన్నీటి కథలకు చలించని జగన్
ఆందోళనలు కొనసాగుతున్నా పట్టించుకోని వైనం

అమరావతి,ఆగస్ట్ 11(ఆర్ఎన్ఎ): అమరావతి ఆందోళనలను జగన్ ప్రభుత్వంపెద్దగా పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు. ఇవన్నీ టిడిపి చేస్తున్న ఆందోళనలుగానే అధికార వైకాపా చూస్తోంది. ఆందోళనల వెనక టిడిపితో పాటు ఓ వర్గం ఉందన్న భావనలో వైకాపా ఉంది. అందుకే ఏడాదిగా సాగుతున్న రైతుల ఆందోలనను సిఎం జగన్, ఆయన అనుచర వర్గం పెద్దగా పట్టించుకోవడం లేదు. రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు కరోనాను కూడా లెక్కచేయకుండా వానలను, ఎండలను

కాదని నిరంతరాయంగా ఆందోళన కొనసాగిస్తున్నా లాభం లేకుండా పోతోంది. ఇప్పటికీ ఆవేదనతో అమరావతికి భూములిచ్చిన 72 మంది రైతులు, కూలీలు చనిపోయినా ప్రభుత్వం పెద్దగా స్పందించ లేదు.

అవన్నీ సహజ మరణాలుగా పాలకులు చూస్తున్నారు. బీజేపీ ఢిల్లీ పెద్దలు కూడా ఈ వ్యవహారంపై చోద్యం చూస్తున్నారు. బిజెపి కూడా రెండు నాల్కల ధోరణితో ఉంది.రాష్ట్ర నేతలు ఒకలా..ఢిల్లీ నేతలు మరోలా ప్రకటనలు చేస్తున్నారు. అలాగే రాజధాని అన్నది రాష్ట్రాని కి సంబంధించిన అంశమని కేంద్ర నాయకత్వం అంటోంది. ఒకే రాష్ట్రం ఒకటే రాజధాని.. అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంత రైతులు చేస్తోన్న ఆందోళనలను పట్టించుకోవడం లేదు. ఆందోళనలకు బెదరకుండా సర్కార్ కూడా తనపని తాను చేస్తూ పోతోంది. మూడు రాజధానులు ముచ్చట పడుతోంది. ఈ దశలో రైతుల ఆందోళను మంగళవారం నాటికి 238వ రోజుకు చేరాయి. వైసీపీ మాటలతో గుండెల్లో శూలాలు దించుతుంటే... బీజేపీ తన ద్వంద్వ వైఖరితో వెన్నుపోటు పొడుస్తోందని అమరావతి 29 గ్రామాల రైతులు, మహిళలు, కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో రాజ్యాంగం అమలు కావడం లేదని మహిళలు నిరసించారు. తాము చేస్తోంది ధర్మపోరాటమని, తమవైపు న్యాయ ముందని, ఆ న్యాయదేవతే తమకు రక్ష అంటూ తుళ్లూరు దీక్షా శిబిరంలో వారు తమ ఆక్రందనలను వెల్లగక్కుతున్నారు. అన్నం పెట్టే రైతుల నోట్లో మట్టికొట్టొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. తమకు ముప్పూటలా తిండిపెట్టే భూములను ఇచ్చామని, తమకు భవిష్యత్ ఉంటుందన్న భావనతో ఇచ్చామని అన్నారు. ఉద్దండరాయునిపాలెంలోని రాజధాని శంకుస్థాపన ప్రాంతంలో కూడా ఆందోళనలు, పూజలు నిర్వహించారు. రైతులకిచ్చిన మాట మీద నిలబడకుండా, వారికి అన్యాయం చేయటం దారుణమన్నారు. రాజకీయ కారణాలతో కాక, మరే కారణాలతోనూ అమరావతి నిర్మాణాలు అగలేదని ఏ చిన్న పిల్లవాడిని అడిగినా చెబుతాడన్నారు. సిఎం మారినప్పుడల్లా విధానాలు మార్చడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి మారగానే రాజధాని మారుతుందా అని ప్రశ్నిస్తున్నారు. అయితే దీనికి ఎక్కడి నుంచీ సమాధానం రావడం లేదు. తాను అధికారం చేపట్టిన ఎపికి మూడు రాజధానులు అన్న రీతిలో సిఎం జగన్ ముందుకు సాగుతున్నారు. రాజధానిగా అమరావతినే కొనసాగిస్తే కమ్మ సామాజిక వర్గం వారు గరిష్ఠంగా లబ్ది పొందుతారనే అభిప్రాయానికి వచ్చిన జగన్, ఆయన అనుచరగణం ఒక పథకం ప్రకారం అమరావతిపై దుష్ప్రచారంచేశారు. అభివృద్ధి అంతా అమరావతిలోనే కేంద్రీకృతమైతే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. అది అమరావతి కాదు భ్రమరావతి అని కూడా ప్రచారం చేశారు. కొందరి కోసమే అమరావతి అన్న భావన ప్రజల్లో విస్తృతంగా వ్యాపించేలా చేశారు. ఫలితంగా అమరావతిని చంపుకోవడం వల్ల తామెంతగా నష్టపోతామో గుర్తించలేక పోతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి చెందాలా? వద్దా? అనే వాదనను జగన్ తెరపైకి తెచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టకూడదనే ఉద్దేశంతో రాజధానిగా అమరావతి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని ప్రకటించిన జగన్ ఇప్పుడు ప్రాంతాల మధ్య విద్వేషాలను ప్రోత్సహించడానికి కూడా వెనుకాడటం లేదన్నది ఈ వ్యవహారంతో అర్థం అవుతోంది. ఇది రానున్న రోజుల్లో ఎపిలో తీరని అసంతృప్తులకు, అలజడులకు కారనమైనా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌పై విస్తృత ప్రచారం

ఆస్తిపన్ను వసూళ్లకు నడుం బిగించిన అధికారగణం

హైదరాబాద్,ఆగస్ట్ 11(ఆర్ఎన్ఎ): ఇంటిపన్నుల బకాయిలు చెల్లింపులో ఇటీవల తెలంగాణ ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలు చెల్లించడానికి 'వన్‌టైం సెటిల్‌మెంట్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒకేసారి చెల్లిస్తే పెండింగ్‌లో ఉన్న బకాయిలపై 90 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి కెటిఆర్ ఈ సమస్యపై చర్చించిన తరవాత పథకాన్ని ప్రకటించారు. దీంతో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో సానుకూలత వస్తోంది. దీంతో ఎక్కడికక్డ స్థానిక బల్దియా అధికారులు కరపత్రాలు, ఆటోలు, ప్లెక్సీలు, లోకల్ చానెళ్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 15 వరకు గడువు ఉందని తెలుపుతున్నారు. ఆయా మున్సిపాలిటీలు తమ ప్రాంతాల్లో పేరుకుపోయిన బకాయిల వసూళ్లకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతున్నాయి.. బకాయి వసూళ్లకోసం ప్రభుత్వానికి ఆదాయం వచ్చేందుకు వన్‌టైం సెటిల్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా మున్సిపాలిటీల్లోనూ బకాయి ఉన్న పన్నులను ఎవరైనా ఒకేసారి చెల్లి స్తే దానిపై ఉన్న వడ్డీలో 90శాతం వడ్డీని మాఫీ చేస్తున్నారు. దీనిపై జిల్లాల్లో ఆయా మున్సిపాలిటీల పరిధిలో పేరుకుపోయి న బకాయి వసూళ్లకు మున్సిపల్ అధికారులు ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయల్లో బకాయిలు పేరుకుపోయాయి. ఇవి వసూలు అయితే తప్ప అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగవు. వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశం సెప్టెంబర్ 15 వరకు మాత్రమే ఉందని, ప్ర జలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద బకాయిలను వసూలు చేయడానికి మున్సిపల్ అధికారులు ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనికింది పెండింగ్‌లో ఉన్న బకాయిలతో పాటు 10 శాతం వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. ఈ అవకాశం వచ్చే నెల 15 వరకు అమలులో ఉంటుంది. మున్సిపల్ రెవెన్యూ అధికారులు బకాయి వసూళ్ల కోసం పెద్ద మొత్తంలో బాకీ ఉన్న వారి వద్దకు వెళ్లి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశం గురించి వివరిస్తున్నారు.

రాజ్యసభ ఉద్యోగులకు గృహయోగం

ఆన్‌లైన్ ద్వారా వెంకయ్య శంకుస్థాపన

న్యూఢిల్లీ,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): రాజ్యసభ సచివాలయ ఉద్యోగుల కోసం 40 నివాస గృహాల నిర్మాణానికి ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సోమవారం ఆన్‌లైన్ వేదిక ద్వారా శంకుస్థాపన చేశారు. ఢిల్లీలోని ఆర్కే పురం సెక్టార్-12లో రూ.46 కోట్లతో ఈ నివాస సముదాయాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. 2003లోనే విలువైన ఈ స్థలాన్ని రాజ్యసభ సచివాలయానికి కేటాయించినప్పటికీ ఆ తర్వాత వివిధ అడ్డంకుల కారణంగా ఆలస్యం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభ సచివాలయ ఉద్యోగుల నివాస గృహాల విషయంలో తీవ్ర కొరత ఉందన్న ఆయన, రెండేళ్ళుగా ఈ అంశం మీద కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి సహా, సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులతో విస్తృత సమావేశాల తర్వాత ఈ అంశం కొలిక్కి వచ్చిందని తెలిపారు. ఈ విషయం మీద ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్, ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌తో కూడా మాట్లాడామన్నారు. టైప్ -3, టైప్ -4 క్వార్టర్ల కొరత తీవ్రంగా ఉందన్న ఉపరాష్ట్రపతి, ఆర్కేపురం నిర్మాణ సముదాయంలో మొదటి దశలోనే ఈ తరహాకు చెందిన 32 క్వార్టర్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. కార్యాలయానికి దగ్గరగా గృహనిర్మాణం వల్ల ఉద్యోగులు ఉత్తమ పనితీరు కనబరిచే దిశగా ప్రేరణ లభిస్తుందని అభిప్రాయపడ్డారు. నాటి పట్టణాభివృద్ధి శాఖ కేంద్ర మంత్రిగా రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ అండ్ డెవలప్ మెంట్ యాక్ట్ 2016ను అమలు చేయడంలో తీసుకున్న చొరవను గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి మరిన్ని గృహాల నిర్మాణానికి చేయూతనివ్వాలని పట్టణాభివృద్ధిశాఖ మంత్రికి సూచించారు. దీని అమలులో భాగస్వాములందరు తమవంతు కృషిచేయాలని పిలుపునిచ్చారు. శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ... రాజ్యసభ సచివాలయ ఉద్యోగుల నివాస గృహాల కొరత తీర్చేందుకు, మూడేళ్లలో ఈ నివాస సముదాయ నిర్మాణం పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. 'రాజ్యసభ చైర్మన్ హోదాలో వెంకయ్యనాయుడు ఈ గృహ సముదాయ నిర్మాణం కోసం తీసుకున్న చొరవ, చేపట్టిన చర్యలు, నిరంతర పర్యవేక్షణ కారణంగానే సమస్యలు చాలావరకూ తొలగి, ఇవాళ ప్రారంభోత్సవానికి మార్గం సుగమమైందని కేంద్రమంత్రి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో అందరికీ నివాస గృహాలు అందించాలన్న లక్ష్యంతో 2016లో ప్రారంభించిన హౌసింగ్ ఫర్ ఆల్ మిషన్ కింద ఇప్పటికే 1.07 కోట్ల నివాస గృహాల మంజూరు జరిగిందని, ఇప్పటికే లక్ష ఇళ్ళను లబ్దిదారులకు స్వాధీనం చేశామని, మరో 65 లక్షల ఇళ్ళు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మొత్తం 1.12 కోట్ల నివాస గృహ మంజూరు లక్ష్యాన్ని 2022 కంటే ముందుగానే చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సెక్రటరీ జనరల్ దేశ్ దీపక్ వర్మ, కార్యదర్శి డాక్టర్ పీపీకే రామాచార్యులు, ఎన్బీసీసీ సీఎండీ వీకే గుప్తా, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ,రాజ్యసభ సచివాలయ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

హాంగ్‌కాంగ్‌లో చైనా ఉక్కుచట్టం
మీడియా టైకూన్ జిమ్మీ లే అరెస్టు

హాంగ్‌కాంగ్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): హాంగ్‌కాంగ్‌లో అణచివేతకు చైనా సిద్ధం అవుతోంది. జాతీయ భద్రతా చట్టం కింద హాంగ్ కాంగ్ దిగ్గజ వ్యాపారవేత్త, మీడియా టైకూన్ జిమ్మీ లేను అరెస్టు చేశారు. విదేశీ శక్తులతో అతను జతకట్టాడన్న ఆరోపణలపై అరెస్టు చేశారు. జూన్ నెలలో చైనా వివాదాస్పద జాతీయ భద్రతా చట్టాన్ని రూపొందించిన విషయం తెలిసిందే. భద్రతా చట్టాన్ని వ్యతిరేకిస్తూ హాంగ్‌కాంగ్‌లో జరిగిన అల్లర్లకు జిమ్మీ లే మద్దతు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. 71 ఏళ్ల జిమ్మీకి బ్రిటన్‌లోనూ పౌరసత్వం ఉన్నది. నెక్స్ట్ డిజిటల్ మీడియా జిమ్మీదే. ఆ కంపెనీలోకి కూడా హాంగ్ కాంగ్ పోలీసులు ఎంటర్ అయినట్లు స్థానిక మీడియా పేర్కొన్నది. జిమ్మీ ఆఫీసులను సెర్చ్ చేశారు. జిమ్మీ లే ఆస్తి సుమారు వంద కోట్ల డాలర్లు ఉంటుంది. తొలుత అతను వస్త్ర వ్యాపారం నిర్వహించారు. ఆ తర్వాత ఆయన మీడియా రంగంలోకి ప్రవేశ ఇంచారు. యాపిల్ డైలీ అనే పత్రికను స్టార్ట్ చేశారు. హాంగ్ కాంగ్‌తో పాటు చైనా ఆధిపత్యాన్ని ఆ పత్రిక వ్యతిరేకించేది. డ్రాగన్ దేశ ఎత్తులను జిమ్మ లే ఎప్పటికప్పుడు తప్పుపట్టేవారు. 2019లో జరిగిన అల్లర్లలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. చైనాకు వ్యతిరేకంగా నెగటివ్ ప్రచారం చేసినట్లు లేపై ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది జరిగిన అల్లర్లకు ఆయనే మాస్టర్‌మైండ్ అని ఆరోపణలు కూడా ఉన్నాయి.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి అజయ్ కుమార్



ఖమ్మంలో పలువురికి కళ్యాణలక్ష్మి చెక్కులు అందచేసిన మంత్రి పువ్వాడ నాగేశ్వర రావు.

ఖమ్మం, ఆగష్టు 11: ఖమ్మం నియోజకవర్గం రఘునాదపాలెం మండలానికి మంజూరైన 66 మంది లబ్ధిదారులకు రూ.66.07 (రూ.66,07,656) లక్షల విలువైన చెక్కులను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పంపిణీ చేశారు. వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయా లబ్ధిదారులకు స్వయంగా మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఒక్క మండలంలోనే అత్యధికంగా 1000 చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబార్ పథకంతో పేదింటి ఆడబిడ్డల దల్లిదండ్రులు ఎంతో సంతోషంగా ఉంటున్నారని పేర్కొన్నారు. అందుకు గాను ముఖ్యమంత్రి కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలు వినియోగించుకోవాలి: గండ్ర

జయశంకర్ భూపాలపల్లి, ఆగస్ట్11 (ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్నా అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. భూపాలపల్లి మండలంలోని కొంపల్ల,నేరేడుపల్లి గ్రామాల్లో రైతు వేదిక భవన నిర్మాణం, కొంపల్లి గ్రామం నుంచి శ్యామల నాయక్ తండా వరకు 80 లక్షల రూపాయల అంచనా వ్యయం తో నిర్మిస్తున్న బీటీ రోడ్డుకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలోని సంక్షేమ పథకాలు దేశానికే నమూనాగా మారాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గాడిద పాల కోసం డెయిరీ
-హర్యానాలో ప్రారంభించేందుకు సన్నాహాలు

చండీగఢ్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): హర్యానాలోని హిస్సార్ జిల్లాలో ఉన్న నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ ఈక్విన్స్(ఎన్ఆర్‌సీఈ) వారు త్వరలో కొత్తగా గాడిద పాల డైయిరీ ప్రారంభించనున్నారు. అయితే అది సాధారణ విషయమే అయినప్పటికీ లీటరు పాల ధర తెలిస్తే ఇక నోరు వెల్లబెట్టాల్సిందే. ఇందుకోసం వారు 10 హలారి జాతి గాడిదల కోసం ఆర్డర్ కూడా ఇచ్చినట్లు రిసెర్చ్ సెంటర్ వారు తెలిపారు. అయితే ఈ జాతికి చెందిన గాడిదలు ఎక్కువగా గుజరాత్‌లోనే కనిపిస్తాయి. వీటి పాలల్లో ఔషధ గుణాలు మెండుగా ఉంటడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇక చిన్న పిల్లలకు గాడిద పాలు ఎంతో మేలు చేస్తాయన్న విషయం త

ఎపిలో అధికారమే లక్ష్యంగా పనిచేస్తాం

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం పూర్తి తోడ్పాటు
పేదలకు ఫలాలు అందాలన్నదే తమ విధానం
ఎపి బిజెపి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సోము వీర్రాజు

విజయవాడ,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): వచ్చే 2024లో జరిగే ఎన్నికల ద్వారా ఏపీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతామని, ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారంలోకి రావడమే తమ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధక్షుడు సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. అందుకు తగు విధంగా కార్యాచరణ చేస్తామని అన్నారు. బిజెపి లక్ష్యాలే తమ అధికారానికి సోపానాలని అన్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన సోము వీర్రాజు మంగళవారం ఉదయం బాధ్యతలు చేపట్టగా ఈ ప్రమాణస్వీకారోత్సవానికి ఆ పార్టీ నేతలు రాంమాధవ్, సతీష్ జీ.. సునీల్ దేవధర్, కన్నా లక్ష్మినారాయణ, పురంధేశ్వరి, విష్ణు, ఎమ్మెల్సీ మాధవ్, రావెల కిషోర్ బాబు తదితరులు హాజరయ్యారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ ఫలాలు అందాలన్నదే బీజేపీ లక్ష్యమన్నారు. కేంద్రం అన్ని గ్రామాలకు ఎల్ఈడీ బల్బులు ఇచ్చిందన్నారు. జన్‌ధన్ ఖాతాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపామని సోము వీర్రాజు అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజల జీవనాడి అని.. కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తుందని సోము వీర్రాజు స్పష్టం చేశారు. బీజేపీది ఎప్పుడూ ఒకటే మాట.. ఒకటే సిద్దాంతమని అన్నారు. చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇతర పార్టీలు తెలంగాణలో విభజన వాదం.. ఏపీలో సమైక్యవాదం పేరుతో ప్రజల్ని మోసం చేశాయని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం కోవిడ్ ఎమర్జెన్సీ ప్రకటించి..15 రోజుల పాటు దానిపై దృష్టి పెట్టాలని సోము వీర్రాజు సూచించారు. అప్పుడే కరోనా కేసులను తగ్గించగలమన్నారు. కరోనా నియంత్రణకు కేంద్రం తగిన విధంగా సాయం అందించిందన్నారు. ఏపీ రాజకీయాల్లో బీజేపీ వాణి వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ అవసరం ఉందని, ఏపీ అభివృద్ధే బీజేపీ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పార్టీలు ఉన్నాయని, ఏపీ అభివృద్ధికి బీజేపీ-జనసేన పార్టీలు కలిసి పనిచేస్తాయన్నారు.

మూడు రాజధానులు ఓ జోక్: రాంమాధవ్

ఏపీలో మూడు రాజధానులపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసలు మూడు రాజధానుల కాన్సెప్ట్ నే ఓ జోక్ గా కొట్టిపారేశారు. మూడు రాజధానులపై ప్రభుత్వం నిర్ణయానికి గవర్నర్ ఆమోదం తెలిపారు.. దీంతో.. కేంద్రం జోక్యం చేసుకోవాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయన్నారు. విభజన తరువాత అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని చెప్పామని.. చంద్రబాబు అమరావతి రాజధానిగా ప్రకటిస్తే కేంద్రం అభ్యంతరం చెప్పలేదన్న ఆయన.. నిధులు కేటాయించి ప్రోత్సహించాం.. యూనివర్సిటీలు పెట్టామని గుర్తుచేశారు. ఇప్పుడు మూడు రాజధానులు అంటే... కేంద్రం జోక్యం చాలా పరిమితంగా ఉంటుందన్నారు. ఒక రాజధాని నిర్మాణంలో అవినీతిని బిజెపి ప్రశ్నించింది.. మూడు రాజధానుల పేరుతో మళ్లీ అవినీతి చేస్తే బీజేపీ పోరాటం చేస్తుందని ప్రకటించారు. దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ కి ఒక్కటే రాజధాని అయినప్పుడు.. ఇక్కడ మాత్రం మూడు ఎందుకు.. ఇది కేవలం అవినీతికి అవకాశం ఇవ్వడానికే అని వ్యాఖ్యానించారు. ఎక్కడా లేనట్లు నామినేషన్ల పర్వంలోనే దౌర్జన్యాలు జరిగిన రాష్ట్రం ఇదే.. ఈసారి మాత్రం మీరు అలాంటి దౌర్జన్యాలను తిప్పికొట్టాలని ఆయన పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. మరో మాట కూడా చెప్పారు.. ప్రతి దానికి ఢిల్లీ ఏదో చేయాలని ఎదురు చూడకుండా.. మీరే రాష్ట్రంలో గట్టిగా పోరాడాలి.. వీధుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. అయితే అమరావతి రైతులు, ప్రజలకు పూర్తి గా న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున తీర్పు వచ్చే వరకు వేచిచూద్దాం అని రాంమాధవ్ అన్నారు.

బాబు పాలనలో నాడు స్వర్ణాంధ్రప్రదేశ్

నేడు కరోనాంధ్రప్రదేశ్‌గా మార్పు
మద్యం షాపులతో కరోనాకు బార్లా తెరిచారు
మండిపడ్డ టిడిపి అధ్యక్షుడు కళా వెంకట్రావ్

అమరావతి,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): వైసీపీ ప్రభుత్వ వైఫల్యంతో రాష్ట్రం కరోనా కోరల్లో చిక్కి విలవిల లాడుతోందని టీడీపీ నేత కళా వెంకట్రావు ఆరోపించారు. ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. కరోనా పుట్టిన చైనాలోని వుహాన్ నగరంలో కేసులు తగ్గినా ఆంధ్రప్రదేశ్‌లో తగ్గకపోవటం సిగ్గుచేటన్నారు. పొరుగు రాష్ట్రాలలో కేసులు తగ్గుతుంటే ఏపీలో మాత్రం రోజు రోజుకీ పెరిగిపోతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రోజుకు 10 వేలకుపైగా కేసులు నమోదవుతున్నా.. చంద్రబాబు నాయుడు హయాంలో నవ్యాంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా వెలుగులు విరజిమ్మితే... నేడు జగన్ హయాంలో కరోనాంధ్రప్రదేశ్‌గా మారిందని ధ్వజమెత్తారు. మద్యం షాపులు తెరిచి కరోనాకి రహదారులు పరిచారని కళా వెంకట్రావు ఆరోపించారు.

ఈ సమయంలో మద్యం విక్రయాలు సరికాదని డబ్ల్యూహెచ్‌వో చెప్పినా వినకుండా అదనంగా గంట సమయం పొడిగించి మద్యాన్ని విచ్చలవిడిగా అమ్ముతున్నారన్నారు. దేశంలో అత్యధిక కేసులు నమోదైన రాష్ట్రంగా ఆంధ్రప్రధేశ్ నిలిచిందని వ్యాక్యానించారు. యాక్టివ్ కేసులలో 87,112 కేసులతో దేశంలోనే 2వ స్థానంలో ఉందన్నారు. గత 10 రోజులలో ప్రతి రోజు కేసులు 6.16 శాతంతో, ప్రతిరోజు మరణాల పెరుగుదల 5.09 శాతంతో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని వ్యాఖ్యానించారు. దేశంలో కరోనా ప్రభావం అత్యధికంగా ఉన్న 30 జిల్లాల జాబితాలో 9 జిల్లాలు మన రాష్ట్రం నుంచే ఉండటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. దేశంలో 8,500 కేసుల కంటే ఎక్కువ కరోనా కేసులు నమోదవుతున్న జిల్లాల జాబితాను పరిశీలిస్తే.. కేవలం మన రాష్ట్రంలో మాత్రమే నూటికినూరు శాతం అన్ని జిల్లాలు ఆ జాబితాలో ఉన్నాయన్నారు. కరోనా కట్టడిలో, ఆస్పత్రుల్లో సదుపాయాల కల్పనలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సొంత పార్టీ నేతలే ఏకరువు పెడుతున్నారని ఆయన చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగుల నుంచి వేల రూపాయలు దోపిడీ చేస్తున్నా పట్టించుకోవటం లేదన్నారు. వైద్యం అందక రోగుల అవస్థలు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితి ఈ విధంగా ఉంటే జగన్‌కు మాత్రం ప్రజల ప్రాణాలు గాలికొదిలి మూడు రాజధానులు, మూర్ఖపు రాజకీయాలతో రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని కళా వెంకట్రావు విమర్శలు గుప్పించారు.

అభివృద్ధిని విస్మరించిన జగన్:దేవినేని

టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతి జిల్లా అభివృద్ధికి బాటలు వేశారని మాజీ మంత్రి దేవినేని ఉమ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. 14 నెలల్లో మీరేం చేశారో చెప్పాలని జగన్‌ను దేవినేని ఉమ ప్రశ్నించారు. 'ప్రతి జిల్లాలో చంద్రబాబు అభివృద్ధికి బాటలు పరిచారు. సీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పరిశ్రమలు తెచ్చాం, సాగు నీరు ఇచ్చాం, విద్యాసంస్థలు పెట్టాం. ప్రజా రాజధానిలో అభివృద్ధికి ప్రభుత్వ వెబ్ సైటే సాక్ష్యం. మాది అభివృద్ధి, వైసీపీది విధ్వంసం. 14 నెలల్లో మీరేం చేశారో ప్రజలకు చెప్పండి జగన్ గారు' అని దేవినేని ఉమ ప్రశ్నించారు.

సచివాలయ నల్లపోచమ్మ విగ్రహం ఎక్కడ?

కూల్చివేతలో ఆలయ ధ్వసంతో అనుమానాలు
పూర్తయిన కూల్చివేత కార్యక్రమం

హైదరాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): తెలంగాణ పాత సెక్రటేరియట్ కూల్చివేత తర్వాత అక్కడ ధ్వంసమైన ఆలయంలోని పురాతన నల్ల పోచమ్మ విగ్రహం ఎక్కడ ఉందన్న అనుమానాలు బయలుదేరాయి. విగ్రహానిక ఇనిత్యపూజలు జరగా÷-సి ఉన్నందున దానిపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నిజంగానే ఆలయ పూజారి తోసహా ఎవరికీ తెలియకుండా ఎలా ఉంటుందన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. రోజూ విగ్రహానికి నిత్యపూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? లేదా అని ఆరా అనుమానిస్తున్నారు. అలా చేయకపోతే అరిష్టమని పండితులు అంటున్నారు. కొత్త సెక్రటేరియట్ నిర్మాణంలో భాగంగా పాత సచివాలయాన్ని నేలమట్టం చేశారు. అదే సమయంలో నల్లపోచమ్మ గుడిని కూల్చేశారు. సచివాలయ భవనాలు కూల్చేస్తుండగా శిథిలాలు పడడంవల్ల పోచమ్మ గుడి దెబ్బతిందని.. అందుకే కూల్చాల్సి వచ్చిందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే గుడిని కూల్చేముందు సరైన పూజాది కార్యక్రమాలు నిర్వహించి విగ్రహాన్ని కదిలించాలి.

కూల్చివేత సమయంలో ఆలయంలో ప్రతిరోజూ పూజలు నిర్వహించే పూజారులకు తెలియకుండా గజ్వేల్‌కు చెందిన పూజారులతో పూజలు చేయించి విగ్రహాన్ని కదిలించి మరోచోటికి తరలించారు. ఆ విగ్రహాన్ని కదిలించే ముందు సరైన పూజాది కార్యక్రమాలు నిర్వహించారో.. లేదో.. ఆ విగ్రహం ఎక్కడుందో తెలియదని నల్లపోచమ్మ ఆలయ పూజారులు అంటున్నారు. దీనికి సంబంధించి వివరాలు మాత్రం గోప్యంగా ఉంచారు. ఇదిలావుంటే తెలంగాణ ప్రభుత్వం కొత్త సచివాలయ నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.. హైకోర్టు తాత్కాలికంగా బ్రేక్‌లు వేసినా.. తర్వాత గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. దీంతో.. యుద్ధప్రాతిపదికన పాత సచివాలయ భవనాల కూల్చివేత పనులు చేపట్టాక సోమవారంతో పూర్తయ్యాయి. సచివాలయంలో ఉన్న మొత్తం 11 బ్లాక్‌ల కూల్చివేతల్లో భాగంగా సోమవారం చివరగా ఎల్ బ్లాక్ ను కూల్చివేశారు. ఇక, శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది... శిథిలాల నుండి ఇనుము, కంకర, అల్యూమినియం, ఇతర సామాగ్రిని వేరే చేస్తున్నారు. వ్యర్థాల తొలగింపుకు మరో నెల రోజుల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు, శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్న ప్రణాళికతో ప్రభుత్వం ఉంది. దీనికి సంబంధించిన కొత్త డిజైన్లకు ఇప్పటికే కేబినెట్ కూడా ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. అలాగే నిర్మాణం కోసం 400 కోట్లు పాలనానుమతులను కూడా ఇచ్చేశారు.

మెదక్ జిల్లా ప్రగతి ధర్మారంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి హరీష్ రావు. చిత్రంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

చేప విత్తనాలతో ఆర్థికంగా ప్రభుత్వం అండ
ప్రగతి ధర్మారంలో చేపపిల్లలను వదిలిన మంత్రి హరీష్

మెదక్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేలా ఉచితంగా చేపపిల్లను అందిస్తున్నామని అన్నారు. వారిని ఆదుకోవడం కోసం ఉచితంగా చేపవిత్తనాలు అందిస్తున్నామని వెల్లడించారు. జిల్లాలోని రామాయంపేట మండలం డి.ధర్మారంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డితో కలిసి గ్రామంలోని ఊర చెరువులో సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద కోటి డెబ్బై ఆరు లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద వంద శాతం సబ్సిడీతో చేపపిల్లలను వదిలామన్నారు. వర్షాకాల ంలోనే కాకుండా ఎండా కాలంలో కూడా నీరు వచ్చేలా ఓటీలు పెట్టి నీళ్లు ఇస్తున్నామన్నారు. చెరువులు, కాలువల్లో ఎల్లప్పుడు నీరు ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేసి మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మత్స్యకారులకు ప్రభు త్వం ఎంతగానో చేయూని స్తుందన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 1,596 చెరువుల్లో 5 కోట్ల చేపపిలలను వదిలనున్నట్లు మంత్రి వివరించారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఐదారు చెరువుల్లో చేపపిల్లలను వదిలే వారని.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా దాదా పు 80 కోట్ల చేప పిల్లలను వదిలేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో హల్దీ, ఘనపూర్ ప్రాజెక్టులలో చేప పిల్లలు, రొయ్యలు వేయడానికి ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. మత్స్యకారుల ఆర్థికాభ్యున్నతికి టూ వీలర్లు, వ్యాన్లు, అందించడంతో పాటు ఎవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందితే వారికి రూ.6 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రభుత్వం అందచేస్తుందని మంత్రి అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం నుంచి చేపలు, రొయ్యలను ఎగుమతి చేసే దిశగా తమ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటు ందన్నారు. కాళేశ్వరం ద్వారా ఓటీ పెట్టడం వల్ల మత్స్యకారుల ఆర్థికాభ్యున్నతితో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవు తుందని మంత్రి అన్నారు. అనంతరం గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మిం చిన నూతన గ్రామపంచాయతీ భవనంతో పాటు డంప్ యార్డు, వైకుంఠధామాలను ప్రారంభించారు

నూతన పారిశ్రామిక విధానంతో ఒరిగేదేమీ లేదు

మాజీ ఆర్థికశాఖ మంత్రి
యనమల రామకృష్ణుడు విమర్శ

అమరావతి,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): నూతన పారిశ్రామిక విధానంతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని టీడీపీ సీనియర్ నేత,మాజీ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శలు గుప్పించారు. కొత్త పారిశ్రామిక విధానంపై ధ్వజమెత్తారు. ఉపాధి కల్పనకు, భవిష్యత్ తరాలకు ప్రయోజనం లేదన్నారు. ఈ పాలసీ కోసమా 14నెలల విలువైన కాలం వృధా చేసింది..? అని ప్రశ్నించారు. వైసీపీ నిర్వాకాల వల్లే పారిశ్రామికరంగంలో మైనస్ 2.2 శాతం వృద్ధి సాధించారని ఎద్దేవా చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తయారీ రంగం, నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగాలన్నీ తిరోగమనంలోనే ఉన్నాయన్నారు. ఈ 14నెలల్లో లక్షలాది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని...చివరికి ప్రభుత్వ ఉద్యోగులకు కూడా సగం జీతాలే అని ఆయన మండిపడ్డారు. క్రెడిట్ రేటింగ్ పడిపోయిందని... పెట్టుబడులు వెనక్కి పోయాయని తెలిపారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను వైసీపీ నాయకులు నాశనం చేశారని వ్యాఖ్యానిం చారు. టీడీపీ ఏడాదికి సగటున రూ.1066 కోట్లు కేటాయిస్తే, వైసీపీ పెట్టింది రూ.852 కోట్లే అని దుయ్యబట్టారు. బలహీన వర్గాల వారికి, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే అవకాశం కాలరాశారని...దీనికి తగిన మూల్యం వైసీపీ చెల్లించక తప్పదని యనమల రామకృష్ణుడు హెచ్చరించారు.

కరోనా రోగి ఆత్మహత్య

హైదరాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): మలక్ పేట యశోద ఆసుపత్రిలో కరోనాకు చికిత్స పొందుతున్న బాధితుడు(60) భయంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రిలోని 503 రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. బాత్ రూమ్‌లోని షవర్‌కి.. పేషెంట్ వేసుకునే గౌన్‌తోనే ఉరి వేసుకున్నాడు. సోమవారం రాత్రి 2:30 గంటల సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా మరణానంతరం మరోసారి కరోనా పరీక్ష నిర్వహించగా.. నెగిటివ్ వచ్చినట్టు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

ప్రాణం తీసిన బైక్ అతివేగం

సిసి పుటేజీల్లో నమోదైన ప్రమాద దృశ్యం

హైదరాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లోని విద్యానగర్- నల్లకుంట రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఆలస్యంగా వెలుగుచూసింది. అతివేగం ఓ యువకుడి ప్రాణం తీసింది. సౌత్ లాలాగూడ విజయపురి కాలనీకి చెందిన ఎండ్రిక్ హరన్(23) అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం తెల్లవారుజామున ఐదున్నర గంటల ప్రాంతంలో ఎండ్రిక్ విద్యానగర్ నుంచి నల్లకుంట వెళ్లే దారిలో ఆంధ్ర మహిళ సభ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో బైక్‌పై అధిక వేగంతో వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో అధిక వేగంతో డివైడర్‌ను డీకొని స్తంభానికి బలంగా డీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అధిక వేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కాగా ప్రమాద దృశ్యాలు సీసీటీవీ ఫుటేజిలో రికార్డు అయ్యాయి.

దేశంలో వరదల పరిస్థితిపై ప్రధాని సమీక్ష

-వివిధ రాష్ట్రాల సిఎంలు అధికారులతో ఆరా

న్యూఢిల్లీ,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): దేశంలోని వరదల పరిస్థితిపై ప్రధాని మోదీ సోమవారంనాడు సమీక్షించారు. వరద బాధిత రాష్ట్రాల మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

కేరళ తరఫున ముఖ్యమంత్రి ఎం.పినరయి విజయన్, రెవెన్యూ మంత్రి ఇ.చంద్రశేఖరన్, ఆరోగ్య శాఖ మంత్రి కేకే శైలజ, చీఫ్ సెక్రటరీ డాక్టర్ విశ్వాస్ మెహతా, డీజీపీ లోక్‌నాథ్ బెహరా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారీ వర్షాల కారణంగా అళపుజ జిల్లా కుట్టనాడ్ తాలూకాలోని లోతట్టు ప్రాంతాల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. ఇడుక్కిలో కొండచరియలు విరిగిపడి మృతి చెందిన వారి సంఖ్య 48కి చేరింది. కర్ణాటక నుంచి ఆ రాష్ట్ర హోం మంత్రి బసవరాజ్ బొమ్మై, రెవెన్యూ మంత్రి ఆర్.అశోక్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కావేరీ నదీ జల మట్టం అంతకంతకూ పెరుగుతుండటంతో ఆ పరిసర ప్రాంతాలకు ఎవరూ వెళ్లకుండా ముందుజాగ్రత్త హెచ్చరికలు జారీ చేసినట్లు మాండ్య జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎంవీ వెంకటేష్ సోమవారంనాడు మీడియాకు తెలిపారు. ఎడతెగని వర్షాలతో కర్ణాటకలోని పలు ప్రాంతాలు వరదల పరిస్థితిని తలపిస్తున్నాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సైతం ప్రభుత్వాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఆగస్టు 6న బీహార్‌లోని పలు జిల్లాల్లో వరద తరహా పరిస్థితి నెలకొనడంతో ఎన్‌డీఆర్, ఎస్‌డీఆర్ఎఫ్ సహా సుమారు 30 టీమ్‌లను రంగంలోకి దింపారు. 16కు పైగా జిల్లాల్లో వరద నీటి మట్టం పెరుగుతోంది.

అయోధ్యకు మద్దతు తెలిపిన జహాన్‌కు వేధింపులు

-పోలీసులకు ఫిర్యాదు చేసిన షమీ మాజీ భార్య

కోల్‌కతా,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ): ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగిన అయోధ్య రామాలయం భూమి పూజకు మద్దతు తెలిపిన క్రికెటర్ మహమ్మద్ షమి మాజీ భార్య హసిన్ జహాన్ బెదిరింపులను ఎదుర్కొంటున్నారు. ఈ వేడుకకు మతాలకతీతంగా అనేకమంది మద్దతు తెలిపారు. క్రికెటర్ మహమ్మద్ షమి మాజీ భార్య హసిన్ జహాన్ కూడా ఆలయ నిర్మాణంపై ఆనంద పడుతున్నట్లు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. అయితే హిందూ ఆలయానికి మద్దతు తెలిపినందుకు కొంత మంది తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని, లైంగిక బెదిరింపులకూ పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె కలకత్తా సైబర్‌సెల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'అయోధ్య భూమి పూజ వేడుకకు శుభాకాంక్షలు చెప్పినప్పటి నుంచి నన్ను కొందరు బెదిరిస్తున్నారు. లైంగిక బెదిరింపులకు పాల్పడటమే కాకుండా చంపేస్తామని భయపెడుతున్నారు. దీని వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నాను'టూ హసిన్ జహాన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే నిందితులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.

"నేను సైతం" కార్యక్రమంలో భాగంగా సి సి కెమెరాల ఏర్పాటు

వేములవాడ, ఆగష9 11 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మున్సిపల్ పరిధి లో గల శాత్రజపల్లి లో ఏర్పాటు చేసిన సి సి కెమెరా లను పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ నేరం జరిగినపుడు కెమెరాలు మనకు నేర నిరూపణలో బాగా ఉపయోగ పడుతున్నాయి అని ప్రతి ఒక్కరు సి సి కెమెరాల ఏర్పాటు కు ముందుకు రావాలి అని, ప్రజా రక్షణ కు కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడుతాయి అని, మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలి అని, ప్రతీ గ్రామం లో, పట్టణ వీధులలో కూడా ప్రతీ ఒక్కరు విధిగా కెమెరాల ఏర్పాటు చేసుకొనుటకు ముందుకు రావాలి అని ×నేను సైతం× ప్రోగ్రామ్ లో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలి అని కోరారు. శాత్రజపల్లి శివాలయం మరియు కురుమ పల్లి లో కెమెరా ల ఏర్పాటు కు ముందుకు వచ్చిన దాత వులి నంవత్ గౌడ్ ని అభినందించారు. ఈ కార్యక్రమం లో శివాలయం యూత్ సభ్యులు, కురుమ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరోనా వ్యాధి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి ఎండి మసూద్

వేములవాడ, ఆగష9 11 (నేటినిజం ప్రతినిధి):మహమ్మారికరోనా వ్యాధి విస్తరిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ప్రభుత్వ వైద్యాధికారి ఎండి మసూద్ అన్నారు, చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో మంగళవారం ఒక వ్యక్తికి కరోనా పాజిటివ్ రావడం జరిగిందన్నారు, చందుర్తి, రుద్రంగి మండలంలో మండలం ఇప్పటి వరకు 90 మందికి కరోనా టెస్టులు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో 87 మందికి నెగటివ్ గా. ముగ్గురికి పాజిటివ్ గా రావడం జరిగిందన్నారు, గ్రామాల్లో విష జ్వరాలు, దగ్గు జలుబు. తదితర లక్షణాలు ఉంటే చందుర్తి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి కొవిడ్ టెస్ట్ లు చేసుకోవాలన్నారు, కొవిడ్ లక్షణాలు ఉంటే ముందస్తుగా కరోనా టెస్టులు చేసుకుంటే వ్యాధి నుంచి బయట పడే అవకాశం ఉంటుందన్నారు, కరోనా వ్యాధి సోకిందని భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు, కరోణ వ్యాధి సోకకుండా గా ముందస్తుగా ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటిస్తూ, మాస్కులు ధరించాల న్నారు, అలాగే వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలన్నారు.

30 ఏళ్లు వెనక్కి వెళ్లిన మూలవాగు

ముసురులలో మూలవాగు ఉరుకులు పరుగులు

వేములవాడ, ఆగష9 11 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని మూలవాగు సోమవారం ఉదయం నాటికి 30 ఏళ్ల వెనక్కి వెళ్ళింది. ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన ఈదురుగాలులతో కూడిన వర్షం తో జల కలను సంతరించుకొని మూలవాగు ఉరుకులు పరుగులు పెడుతూ రాజేశుని జలాశయాన్నీ చేరుకుంది. 1989లో కురిసిన వర్షాలతో ఇరువైపులా ఉన్న గట్లని పట్టుకొని ప్రవహించిన మూలవాగు ను స్థానికులు మరో మారు గుర్తు చేసుకున్నారు. అడపాదడపా కొద్దిపాటి ప్రవాహం సాగినప్పటికీ వేములవాడ లో మాత్రం నీటి కష్టాలు అంతంత మాత్రానే తీరాయి. ప్రస్తుతం ఆదివారం నుండి సోమవారం రాత్రి వరకు కురిసిన తుఫాను ప్రభావంతో మూలవాగు నిండు కుండల ప్రవాహంతో ముందుకు సాగింది. ఈ ప్రవాహాన్ని చూసేందుకు వర్షంలో సైతం అనేకమంది స్థానికులు వేములవాడ బ్రిడ్జి పై గంటలకొద్దీ నిలిచి ఉండి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

జయవరం బ్రిడ్జి నిర్మాణం పూర్తి ...నెరవేరిన గ్రామస్తుల కల

వేములవాడ, ఆగష9 11 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ప్రతినిధి 40 సంవత్సరాల కల నెరవేర్చిన సీఎం కేసీఆర్ ,ఎమ్మెల్యే రమేష్ బాబు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు జయవరం వేములవాడ మండలం లోని మూలవాగు పైన 6 కోట్ల వ్యవయంతో బ్రిడ్జి నిర్మాణము పూర్తి అయిన సందర్భంలో జయవరం గ్రామస్తుల ఇబ్బందులు తొలగాయని , గతం లొ వర్షాకాలం వాగు పస్తే రవాణా సౌకర్యానికి అంతరాయం కలిగి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు వంతెన నిర్మాణం పూర్తవడంతో గ్రామస్త